RNI-TGBIL/25/A1275

ప్రజా తెలుగు శక్తి

www.prajatelugushakthi.com

TELUGU DAILY

TV15 A Voice Of Truth.....

సంపుటి (Volume) :01 సంచిక (Issue) :257 ఎడిటర్ : SDతాజ్ బాబా పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం-03- అక్టోబర్ - 2026

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంపై మంత్రి లోకేశ్ కీలక అప్‌డేట్



రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంలో పురోగతి ఉందన్న మంత్రి లోకేశ్

స్నేహలోకి వచ్చిన బాలికను తల్లి పరామర్శించిందని వెల్లడి

సాయంత్రం వెంటిలేటర్ తొలగించే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పినట్లు వెల్లడి

వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుందని మంత్రి పోస్ట్

స్నేహితురాలు లక్ష్మికి కూడా ఆసుపత్రిలో చికిత్స అందుతోందని వెల్లడి

అమరావతి : రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిలో పురోగతి కనిపిస్తోందని వైద్యుల బృందం వెల్లడించినట్లు ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. బాలిక స్పృహలో ఉందని, తల్లి ఆమెను పరామర్శించిందని తెలిపారు. వైద్యుల సూచనలను అర్థం చేసుకుని స్పందిస్తోందని వివరించారు. మిగతా..2లో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్ల నిధుల మంజూరు



నగర వాసులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కోసం రూ.150 కోట్ల నిధులు విడుదల చేసింది.

హైదరాబాద్, నవంబర్ 2: నగర వాసులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కోసం రూ.150 కోట్ల నిధులు విడుదల చేసింది. రుణం రూపంలో నిధుల విడుదలకు పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. 2026-27 బడ్జెట్‌లో మెట్రోకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో తొలి విడతగా రూ.125 కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెం.990 జారీ చేసింది. అలాగే ప్రతి నెలా నిధుల వినియోగంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిధులతో మెట్రో విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్- కోకాపేట్, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, మిగతా..2లో

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ



తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేదని.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో శిక్షణ అందిస్తామని వెల్లడించారు. విద్యార్థులకు ఏఐ, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్

తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం..

మహా పాదయాత్రలో అమిత్ షా

- 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం'
- పేరిట బీజేపీ నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొని ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.
- అనంతరం ఆయన బహిరంగ సభలో ప్రసంగించారు.



హైదరాబాద్, నవంబర్ 2: 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం' పేరిట బీజేపీ నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొని ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. తెలంగాణలో కాషాయ పార్టీని అధికారంలోకి తీసుకురావాలంటే తనతోపాటే నినాదాలు చేయాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం అమిత్ షా బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేద్దామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి, ఇక్కడి అరాచకశక్తులను తుదముట్టిద్దామని చెప్పారు. త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని కేంద్ర హోంమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్ ఒక చొరబాటుదారుడు..

అనంతరం అమిత్ షా కాంగ్రెస్ పార్టీ పై మండిపడ్డారు. ఢిల్లీలో ఆ పార్టీ నిర్వహించింది ఓట్ బచావో ర్యాలీ కాదని, మిగతా..2లో



హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
- భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్: హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. మిగతా..2లో

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే.. 'వీటో'తో అడ్డుకుంటా

మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిచి, కాంగ్రెస్‌పై పట్టు సాధిస్తే, వారు ప్రతిపాదించే బిల్లులను అడ్డుకోవడానికి తన వీటో ఆధికారాన్ని వాడుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు.




ఢిల్లీ : కాంగ్రెస్ ఉభయ సభల్లో లేదా ఏదైనా ఒక సభలో రిపబ్లికన్లు మెజారిటీ కోల్పోతే తాను 'మిస్టర్ వీటో' (వీటీ ఎఫ్‌శీ) గా మారతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'ది న్యూయార్క్ పోస్ట్' జర్నలిస్ట్ మిరాండా డివైన్ నిర్వహిస్తున్న 'పాడ్ ఫోర్స్ వన్' పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డెమొక్రాట్ల నియంత్రణలోని కాంగ్రెస్‌ను ఎలా ఎదుర్కొంటారని అడిగిన ప్రశ్నకు.. "నేను 'మిస్టర్ వీటో'గా మారతాననుకుంటున్నాను.. దేశాన్ని నాశనం చేయడానికి నేను వారిని అనుమతించను" అని ట్రంప్ సమాధానం ఇచ్చారు.

మిస్టర్ వీటోగా...

డెమొక్రాట్లు పంపే బిల్లులను తాను తిరస్కరిస్తానని, వీటో అధికారాన్ని ఉపయోగించి తద్వారా వారిని చర్చల వేదికపైకి తీసుకొచ్చేల చేస్తానని ఆయన వివరించారు. "వారు అనేక బిల్లులను పంపుతారు, మీరు వాటిని వీటో చేస్తారు. ఒకటో రెండో నెలలు అన్ని బిల్లులు వీటో అయిన తర్వాత, సమయం వృధా అవుతోందని గ్రహించి వారు వచ్చి మనతో మిగతా..2లో

అంతరిక్షంలో చైనా రహస్య విమానం.. అమెరికా నిఘా



★ భూమి చుట్టూ కక్ష్యలో తిరుగుతున్న ఈ రోబోటిక్ అంతరిక్ష విమానం గతంలో అంతరిక్షంలో గుర్తుతెలియని వస్తువును విడుదల చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది.

★లో ఎర్త్ ఆర్బిట్ లో గుర్తుతెలియని వస్తువులను విడుదల చేసినట్లు గతంలో పలు నివేదికలు వెల్లడించాయి.

ఢిల్లీ : చైనా అత్యంత రహస్యమైన అంతరిక్ష విమానం "షెన్లాంగ్" కు చెందిన ఒక ఫోటో సంచలనంగా మారింది. మిగతా..2లో

దీపావళి రోజు బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతి- రాత్రి 8-10గంటల వరకు మాత్రమే!

- దిల్లీ- ప్రాంతంలో పర్యావరణహిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది.
- ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలతో పాటు మరికొన్ని ప్రాంతాలకు అనుమతి లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది.త



దీపావళి పండగ సందర్భంగా దిల్లీ-ప్రాంతంలో పర్యావరణ హిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. కేవలం నవంబర్ 7, 8 తేదీల్లో అది కూడా ఉదయం 6నుంచి 7గంటల వరకు, మళ్లీ సాయంత్రం 8నుంచి 10గంటల మధ్య మాత్రమే హరిత టపాసులు పేల్చుకోవాలని స్పష్టంచేసింది. ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాలతోపాటు సైలెన్స్ జోన్‌లుగా నోటిపై చేసిన అన్ని ప్రాంతాలకు 300 మీటర్ల పరిధి లోపు ఎలాంటి క్రాకర్స్ పేల్చడానికి అనుమతి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. బేరియంతో తయారైన బాణాసంచాతో పాటుగా గ్రీన్‌క్రాకర్స్‌గా ధ్రువీకరించని బాణాసంచా విక్రయాలను ఎట్టిపరిస్థితుల్లో జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. అలాగే హండ్రెడ్ వాలా, తౌజండ్ వాలా వంటి టపాసులను పేల్చకుండా చూడాలని ఆదేశించింది. నవంబర్ 9 నుంచి టపాసులపై మళ్లీ పూర్తి స్థాయి నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది.

మిగతా..2లో

రీపోలింగ్ అన్ని కేంద్రాల్లో నిర్వహించాలి



- చంద్రబాబు ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు
- ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపణ
- రిగ్గింగ్‌లో చంద్రబాబు సొత్ బీహార్‌ను మించిపోయారని వ్యాఖ్య
- అక్రమాలు జరిగిన చోట రీ-పోలింగ్ నిర్వహించాలని ఈసీకి డిమాండ్
- దోషులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

- రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ స్థానాలనూ కైవసం చేసుకోవాలని లక్ష్య నిర్దేశం
- కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పట్టణ స్థానిక ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం
- తుఫాన్ల సమయంలోనూ ఎన్నికలు, పాలనపై ఏకకాలంలో దృష్టి సారించామన్న సీఎం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం



ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం



- పులివెందులలో 70 బూత్‌లలో ఏజెంట్లను తరిమేశారని ఆరోపణ
- 4 బూత్‌లలో రీపోలింగ్ పెట్టడం కంటితుడుపు చర్య అని విమర్శ
- ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం

అమరావతి: రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా మారిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనమని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థే అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణమని ఆయన మండిపడ్డారు. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లకు గాను 70 చోట్ల తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ గూండాలు అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. పోలీసుల మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘం అధికార పార్టీకి
కొమ్ముకాయడం దారుణం: జగన్

సహకారంతోనే బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు దాడులకు పాల్పడి, తమ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాగేశారని తెలిపారు. ఓటర్ల స్లిప్పులు లాక్కొని, బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్, సైక్లింగ్‌కు పాల్పడ్డారని, వీటికి స్పష్టమైన వీడియో ఆధారాలున్నాయని పేర్కొన్నారు. అయితే, 70 బూత్‌లలో అక్రమాలు జరిగితే, కేవలం 4 బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడం దారుణమని జగన్ అన్నారు. ఇది ప్రజలను మభ్యపెట్టే కంటితుడుపు చర్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వాటిని స్వేచ్ఛాయుత ఎన్నికలు అంటారా? అంటూ ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరహా ఘటనలు కేవలం పులివెందులకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా జరిగాయని జగన్ తెలిపారు. కడప, తిరుపతి, కర్నూలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కార్పొరేషన్లతో పాటు మాచర్ల, కుప్పం, పుత్తూరు, నంద్యాల వంటి అనేక మున్సిపాలిటీల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని... గెలుపు ఆలస్యమైనా అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తాయని ఆయన పునరుద్ఘాటించారు.

రీపోలింగ్ అన్ని కేంద్రాల్లో నిర్వహించాలి

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అధికార కూటమి భారీ ఎత్తున రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. "రిగ్గింగ్ అనే పదానికి కూటమి ప్రభుత్వం కొత్త నిర్వచనం ఇచ్చింది. రిగ్గింగ్ చేయడంలో చంద్రబాబు సౌత్ బీహార్‌ను మరిపించారు. ప్రజల్లో మద్దతు లేక, ఓటమి భయంతోనే బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లతో గెలవాలని చూడటం సిగ్గుచేటు" అని షర్మిల విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని బానిసగా చేసి, ప్రజల తీర్పును అపహాస్యం చేశారని, ఇది దేశ ఎన్నికల చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయమని ఆమె అభివర్ణించారు. ఒకవైపు పారదర్శకత అని నీతులు చెబుతూ, మరోవైపు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల వ్యవస్థను శాసించడం ఎలాంటి ప్రజాస్వామ్యమని షర్మిల ప్రశ్నించారు. ప్రశాంత వాతావరణంలో కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా భయానక పరిస్థితుల్లో, దాడులు, దౌర్జన్యాల మధ్య ఎన్నికలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే స్పందించాలని షర్మిల డిమాండ్ చేశారు. బూత్ క్యాప్చరింగ్, దొంగ ఓట్లు, దౌర్జన్యాలు జరిగినట్లు వీడియో ఆధారాలు ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంలో వెంటనే పోలింగ్ రద్దు చేసి, రీ-పోలింగ్ నిర్వహించాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోని వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ ఫుటేజ్‌లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అక్రమాలకు సహకరించిన రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, పోలీసులపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రాప్తాడు దాడిలో గాయపడిన
బాలిక ఆరోగ్యంపై మంత్రి లోకేశ్ కీలక అప్‌డేట్

పరిస్థితి ఇలాగే మెరుగుపడితే గురువారం సాయంత్రం వెంటిలేటర్ సపోర్ట్ తొలగించే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నట్లు చెప్పారు. బాలిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదే ఘటనలో గాయపడిన మరో బాలిక లక్ష్మి ధైర్యసాహసాలను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఓ వ్యక్తి రంపంతో పాఠశాలలోకి ప్రవేశించి దాడికి పాల్పడిన సమయంలో లక్ష్మి భయపడి పారిపోకుండా తన స్నేహితురాలిని కాపాడేందుకు ముందుకు వెళ్లిందని తెలిపారు. ఆమెను రక్షించే ప్రయత్నంలో తాను కూడా తీవ్రంగా గాయపడిందని పేర్కొన్నారు. తనను తాను కాపాడుకునే అవకాశం ఉన్నా.. స్నేహితురాలికి అండగా నిలిచిందని ప్రశంసించారు. ప్రస్తుతం ఇద్దరు బాలికలూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని లోకేశ్ తెలిపారు. లక్ష్మికి కూడా మెరుగైన వైద్యం అందిస్తున్నామని, రెండు కుటుంబాలకూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని ఏ పాఠశాల తరగతి గదిలోనూ చిన్నారులు అభద్రతకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు
రూ.150 కోట్ల నిధుల మంజూరు

మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్ - హయత్‌నగర్ కారిడర్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు-భారత్ ఫ్యూచర్‌సిటీ, జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్ - శామీర్‌పేట్ కారిడర్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించింది.

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన,
ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ (సోమవారం) మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాల తరలింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, గ్రీనరీ నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు, నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పక్కా ప్రణాళికలతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు
ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ ప్రత్యేక కోర్సులను అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను విద్యార్థులు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు అందిస్తామన్నారు. విద్యార్థులకు హ్యాకథాన్లు, ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. కళాశాల అధ్యాపకులకూ ప్రపంచస్థాయి ఏఐ, క్లౌడ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. లక్ష మంది యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

అంతరిక్షంలో చైనా రహస్య విమానం..
అమెరికా నిఘా నివేదికలో కీలక వివరాలు.!



అమెరికా నిఘా సంస్థ విడుదల చేసని రక్షణ ముప్పు అంచనా నివేదికలో దీని గురించి ఉంది. భూమి చుట్టూ కక్ష్యలో తిరుగుతున్న ఈ రోబోటిక్ అంతరిక్ష విమానం గతంలో అంతరిక్షంలో గుర్తుతెలియని వస్తువును విడుదల చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. గత ఆరేళ్లుగా ఇది అంతరిక్షంలో తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. లో ఎర్త్ ఆర్బిట్ లో గుర్తుతెలియని వస్తువులను విడుదల చేసినట్లు గతంలో పలు నివేదికలు వెల్లడించాయి. దీనిపై వార్తలు రావడంతో పలు సంస్థలు, వ్యక్తులు భూమిపై ఉన్న రాడార్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో దీనిని ట్రాక్ చేస్తున్నారు. తాజాగా వెలువడిన ఫోటోలను 2024లో మ్యాక్సర్ టెక్నాలజీస్ శాటిలైట్ తీసింది. సుమారు 90 కిలోమీటర్ల దూరం నుంచి దీనిని ఫోటో తీసింది. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రూపొందించిన థ్రెట్ అసెస్మెంట్ నివేదికలో ఈ చిత్రం ఉంది. అంతరిక్షంలోకి వెళ్లిన వస్తువుల్ని కక్ష్యలో ప్రవేశపెట్టడం, వాటిపై ప్రయోగాలు నిర్వహించడం, తిరిగి భూమిని చేరుకునే సామర్థ్యాలు ఈ అంతరిక్ష విమానానికి ఉన్నాయని నివేదిక పేర్కొంది. అంతరిక్షంలో మరో ఉపగ్రహానికి ఈ విమానం అనుసంధానమై ఉన్నట్లు ఫోటోలో కనిపిస్తోంది. దీని సోలార్ ప్యానెల్స్ విస్తరించి ఉన్నాయి. విమానం వెనక భాగంలో పేలోడ్ తలుపు కూడా తెరిచి ఉన్నట్లు ఫోటోలో కనిపిస్తోంది. షెన్‌లాంగ్ రవునర్వినియోగించగల అంతరిక్ష విమానం. ఇది అమెరికాకు చెందిన బోయింగ్ నిర్మిత ఠ-37డీ అంతరిక్ష విమానాన్ని పోలి ఉంటుంది. రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపిన తర్వాత కక్ష్యలోకి చేరుకుని విమానంలా మళ్లీ భూమిపై ల్యాండ్ అవుతుంది. ప్రస్తుతం ఇది నాలుగో మిషన్ కోసం అంతరిక్షంలో ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న చైనాలోని జియుక్వాన్ శాటిలైట్ సెంటర్ నుంచి లాంగ్ మార్చ్ -2 ఎఫ్ రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించారు. షెన్‌లాంగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు చైనా ఎలాంటి ఫోటో విడుదల చేయలేదు. అయితే, ప్రస్తుతం ఫోటోను బట్టి ఈ అంతరిక్ష విమానం పొడవు సుమారు 26 అడుగులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం.. మహా పాదయాత్రలో అమిత్ షా

మొదటి పేజి తరువాయి

అది చౌరబాటుదారులను కాపాడే ప్రయత్నమని ఆయన విమర్శించారు. 'రాహుల్ గాంధీ కూడా ఒక చౌరబాటుదారుడు. కాంగ్రెస్.. చొరబాటుదారులను ఓటుబ్యాంక్‌గా చూస్తోంది. చొరబాటదారుల ఓట్లు తొలగించొద్దా? ఒక వ్యక్తికి రెండు ఓట్లు ఉంటే తొలగించాలా.. వద్దా?'అని ప్రశ్నించారు. దొంగ ఓట్లు తొలగిస్తుంటే రాహుల్‌కు కడుపుమండుతోందని ధ్వజమెత్తారు. సర్ ప్రక్రియను ఆపాలని కాంగ్రెస్ అండ్ కంపెనీ కుట్ర చేస్తోందని, 13 కోట్ల ఓట్లు తొలగించారని రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని అమిత్ షా ఆరోపించారు. 'సర్ జరగకముందూ అనేక ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. సర్ కారణంగానే మేం అధికారంలోకి వచ్చామని రాహుల్ అంటున్నారు. మరి రాహుల్ ఎంపీ అయింది కూడా సర్ వల్లేనా'



అంటూ కేంద్ర హోంమంత్రి చురకలంటించారు. జీవితంలో రాహుల్ ప్రధాని కాలేరని, మాక్ పార్లమెంట్‌లో ప్రధాని సీట్‌లో కూర్చొని సంబరపడాల్సిందేనని ఎద్దేవా చేశారు. తాము సర్‌పై చర్చించేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీకి సవాలు విసిరారు.

ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు

ఈవీఎంలతోనే కేంద్రంలో బీజేపీ గెలిచిందనుకుంటే, తెలంగాణలో రేవంత్ ఎలా గెలిచారని అమిత్ షా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వబోమని నొక్కి చెప్పారు. 'ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది. అలాంటి పార్టీ మోదీని అడ్డుకుంటుందా? కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ కాపాడలేరు'అని పేర్కొన్నారు. 'తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఆర్ఆర్ అంటే రేవంత్ టూ రాహుల్ ట్యాక్స్. రాహుల్‌కు రేవంత్ కప్పం కడుతున్నారు' అని అమిత్ షా ఆరోపించారు. తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు కావట్లేదని ఆయన విమర్శించారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం

మొదటి పేజి తరువాయి

అమరావతి : రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో



జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'ముంరసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు. ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

దీపావళి రోజు బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతి- రాత్రి 8-10గంటల వరకు మాత్రమే!

మొదటి పేజి తరువాయి

'కాలుష్యంపై ఎప్పటికప్పుడు సమీక్ష జరగాలి'

గతంలో తాము ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారులు తీసుకున్న చర్యలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సమస్య అంతా కోర్టు ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలోనే ఉందని, సంబంధిత అధికారులు, విభాగాల మధ్య మెరుగైన సమన్వయం ఉండాలని కోర్టు అభిప్రాయపడింది. పండుగ సీజన్‌లోనే కాకుండా, ఆ తర్వాత కూడా పర్యావరణ కాలుష్యం, దాని పర్యవసాన ప్రభావాలపై ఎప్పటికప్పుడు సమీక్ష జరగాలని పేర్కొంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ నిర్వహించే వివిధ పర్యవేక్షణ కేంద్రాల నుంచి ఏక్యూఐ డేటాను సేకరించాలని ధర్మాసనం పేర్కొంది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా ప్రజారోగ్య అధికారులతో సహా సంబంధిత వర్గాల మధ్య మరింత చర్చ, సంప్రదింపులు జరపాలని న్యాయస్థానం అభిప్రాయపడింది. "కాలుష్యం కారణంగా రోగుల సంఖ్యలో పెరుగుదల, అలాగే మరణాలు పెరగడం, వాటికి సంబంధించిన గణాంకాలను ఢిల్లీ-ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఉన్న



ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుంచి సేకరించాలి. మానవులతో పాటు, ప్రతి జీవిలో, ప్రతి రూపంలోనూ జీవం ఉంటుంది. ప్రకృతిలోని గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశం అనే పంచభూతాలను దేవుళ్లుగా భావించి పూజించే సంస్కృతి మనది. అందువల్ల ఏ మతాచారమైనా ఈ ఉన్నతమైన ఆలోచనలకు అనుగుణంగానే ఉండాలి" అని న్యాయస్థానం పేర్కొంది. పటాకులు కాల్చడం అనేది పండుగ వేడుకల్లో భాగంగా మారినప్పటికీ, అది గాలి, ధ్వని కాలుష్యానికి కారణమవుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అనియంత్రిత పద్ధతి వల్ల పటాకులు కాల్చేవారితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని హెచ్చరించింది.

నటి దియామీర్జా ఉన్న దీపావళి వీడియో తొలగింపు

ఇదిలా ఉండగా, పర్యావరణహితంగా దీపావళి పండగను చేసుకోవాలంటూ బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రచార వీడియోను పోస్టు చేసింది. ఇందులో సినీనటి దియామీర్జా నటించిన దీపావళి ప్రకటన వివాదానికి దారితీసింది. దీనితో ఆ వీడియోను బీఎంసీ తొలగించింది. బీఎంసీ పోస్టు చేసిన వీడియోల్లో, కాలుష్యానికి దూరంగా ఉండాలంటూ నటి ప్రజలను అభ్యర్థించారు. దీనిపై బీజేపీ నాయకుడు అమిత్ సతమ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీపావళి పండగను ఎలా చేసుకోవాలో ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. దీపావళి పండగ దేశ సంస్కృతిలో ఒక భాగమని, దియాను ఉద్దేశించి ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ విషయంపై కాస్త వివాదం చెలరేగడంతో ఆ వీడియో బీఎంసీ సోషల్ మీడియా ఖాతాల నుంచి ఎలాంటి వివరణ ఇవ్వకుండా తొలగించింది. భారీ శబ్దాలు, వాయు కాలుష్యం లేకుండా దీపావళి చేసుకోవాలంటూ బీఎంసీ ఇటీవల అవగాహన ప్రచారం చేపట్టింది. అందులో కొన్ని వీడియోలను పోస్టు చేయగా, వాటిల్లో ఒకదానిలో దియామీర్జా నటించారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే.. 'వీటో'తో అడ్డుకుంటా: డొనాల్డ్ ట్రంప్

మొదటి పేజి తరువాయి

ఒప్పందం చేసుకుంటారు" అని ట్రంప్ పేర్కొన్నారు. బిల్లులు ఆమోదంపై రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఒప్పందానికి రావడం ఇదే మొదటిసారి కాదని ఆయన అన్నారు. "ఏదో ఒక దశలో మనం ఒప్పందాలు చేసుకుంటాం. ఇదివరకు కూడా ఇలాగే జరిగింది. ఇది కొత్తేమీ కాదు" అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ పరిస్థితి రాకుండా రిపబ్లికన్లే కాంగ్రెస్‌పై నియంత్రణను నిలుపుకుంటారని ఆశిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. "మేము విజయం సాధిస్తామని భావిస్తున్నాను.. కానీ ఒకవేళ గెలవకపోతే నేను ప్రతిదాన్నీ వీటో చేస్తాను. నేను వీటో చేస్తూనే ఉంటాను" అని ఆయన అన్నారు. ట్రంప్ ప్రస్తుత పదవీకాలంలో ఇప్పటివరకు కేవలం రెండుసార్లు మాత్రమే వీటో అధికారాన్ని ఉపయోగించారు. తన మొదటిసారి అధ్యక్ష పదవిలో ఆయన 10 బిల్లులను వీటో చేశారు.

ఏంటీ వీటో అధికారం?

అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లును తిరస్కరించే అధికారం ఆ దేశాధ్యక్షుడికి ఉంటుంది. అయితే, ప్రతినిధుల సభ (ఎశీబంవ శీట =వజూతీవంవఅ్‌అజవం), సెనేట్ రెండింటిలోనూ మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆ బిల్లుకు అనుకూలంగా ఓటు వేస్తే, అధ్యక్షుడి వీటోను అధిగమించి కాంగ్రెస్ ఆ బిల్లును చట్టంగా మార్చవచ్చు.

మూడోసారి పోటీపై

ఈ ఇంటర్వ్యూలో మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశంపై కూడా ట్రంప్ మాట్లాడారు. "నాకు అవకాశం ఉంటే మళ్లీ పోటీ చేయడానికి ఇష్టపడతాను, కానీ రాజ్యాంగ నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన చెప్పారు. ఎవరైనా రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నిక కాకుండా నిరోధించే అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు నవంబరు 3న



జరగనున్నాయి. ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనెట్‌లోని 35 స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ ఉండగా.. తిరిగి తమ చేతుల్లోకి తీసుకోవాలని డెమొక్రాట్లు ప్రయత్నిస్తున్నారు. ఆ సభపై పట్టు సాధించడానికి వారికి మరో మూడు స్థానాలు అవసరం.

రెవెన్యూ, అటవీ వివాదాలకు జాయింట్ సర్వేతో ఫుల్‌స్టాప్

గ్రామస్థాయి నుంచి రెండు శాఖల మధ్య సమన్వయం అవసరం

జాయింట్ సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా

ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ప్రజాతంత్ర, నవంబర్ 2 : రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని, రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని, కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని తెలిపారు. దీంతోపాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ భూముల మధ్య కూడా వివాదాలు ఉన్నాయని, ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన హద్దులను నిర్ధారించాలన్నారు. ఈ సమస్యలను ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతగా నెట్టివేసే ధోరణి విడనాడాలని, పరస్పర సమన్వయంతో పరిష్కార దిశగా అడుగులు వేయాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను అక్కడే పరిష్కరించాలని, ఉన్నతస్థాయి



నిర్ణయాలు అవసరమైన అంశాలను వెంటనే రాష్ట్రస్థాయికి నివేదించాలన్నారు. ఏళ్లతరబడి వివాదాలు కొనసాగడం వల్ల రైతులు, భూయజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా, వాస్తవ ఆధారాలతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిర్ణీత కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ఇకపై రెవెన్యూ-అటవీ భూ సరిహద్దు వివాదాల పరిష్కార ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. రెండు శాఖల మధ్య సమన్వయానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తానన్నారు. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తిరిగి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వతంగా తెరపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తోందని వెల్లడించారు. భూ రికార్డులలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పట్టుదలతో పనిచేసి దశాబ్దాల నాటి భూ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు సహకరించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

విశ్వనాథసమగ్రదర్శనానికి 'జెన్‌జీ'కళ్ళద్దాలుచాలవేమో!

'వివిధ' సాహిత్య వేదికలో యువ రచయిత ప్రసాద్ సూరి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి నవలలపై చేసిన విశ్లేషణ చదివాను ('ఆధునిక యుగపు ప్రాచీన కథకుడు: 26.10.2026). విశ్వనాథ వారి రచనా వైభవాన్ని ప్రశంసిస్తూనే, ఆయన దృక్పథాన్ని, భాషను, తాత్వికతను ఆధునిక కొలమానాలతోముఖ్యంగా పాశ్చాత్య పాప్-కల్చర్ దృష్టితోఅర్థం చేసుకునే ప్రయత్నం ఆ వ్యాసంలో కనిపించింది. "చదువుతూ ఆయన్ను నిందాస్తుతి చేస్తూనే ఉన్నాను" అని వ్యాసకర్త స్వయంగా చెప్పుకున్నట్లుగానే, ఆ వ్యాసంలో ఒకింత సందిగ్ధత, పాక్షిక అవగాహన కనిపించాయి. ఒక కాలపు రచయితను మరో కాలపు పాఠకుడు అంచనా వేసేటప్పుడు దొర్లే సహజమైన పొరపాట్లను సాహిత్య విమర్శ కోణం నుండి పరిశీలించాలి. వ్యాసకర్త విశ్వనాథ వారు చెప్తుంటే ఇతరులు రాసేవారని, అది ప్రాచీన వ్రాయసకాళ్ల పద్ధతి అని పేర్కొన్నారు. విశ్వనాథ అనుసరించిన ఉక్తలేఖనం (ణఅఖ్ఘ్అశీఅ) కేవలం పాత పద్ధతిని అనుకరించడం కాదు; అది ఆయన చిత్తైకాగ్రతకు, ధారణా శక్తికి సంబంధించిన అంశం. 'వేయి పడగలు' వంటి బృహత్ నవలనైనా, 'రామాయణ కల్పవృక్షం' లాంటి మహాకావ్యాన్నైనా మనసులోనే రూపుదిద్దుకుని, ఆశువుగా చెప్పగలగడం వెనుక నిరంతర అభ్యాసం ఉంది. దాన్ని కేవలం ఒక 'ప్రాచీన టెక్నిక్'గా మాత్రమే చూడటం ఆ రచనా ప్రక్రియ వెనుక ఉన్న మేధోశ్రమను తక్కువగా అంచనా వేయడమే. విశ్వనాథ నవలా ఎత్తుగడలను మెచ్చుకుంటూ, వాటిని పాఠకుడిని ఆకర్షించే 'ట్రిక్' అనడం, ఆయనపై ఇంగ్లీషు సినిమాల ప్రభావం ఉందేమోనని ఊహిం చడం తర్కానికి నిలవదు. విశ్వనాథ వారికి ఆంగ్ల సాహిత్యంతో గాఢమైన పరిచయం ఉన్న మాట వాస్తవమే అయినా, ఆయన కల్పనా శక్తికి ప్రధాన మూలం భారతీయ పురాణేతిహాసాలు, కథాసరిత్సాగరం వంటి ప్రాచీన వ్యాయం. వ్యాసకర్త 'హాహా హూహూ' నవలను ఇంగ్లీష్ యానిమేషన్ కామెడీ సిరీస్ 'బోజాక్ హార్స్‌మ్యాన్'తో పోల్చడం ఆ నవల పరిధిని కుదించడమే. 'హాహా హూహూ' కేవలం గుర్రం తల ఉన్న మనిషి వింత కథ కాదు; లండన్ వీధుల్లో పడ్డ గంధర్వుడి ద్వారా పాశ్చాత్య భౌతికవాదాన్ని, ఆధునిక విజ్ఞాన శాస్త్రపు పరిమితులను తాత్విక దృష్టితో విమర్శించిన వ్యంగ్య రచన అంతర్లీనంగా ఉన్న ఈ తాత్విక చర్చను వదిలేసి, కేవలం గుర్రం తల ఆకారాన్ని బట్టి ఒక కార్టూన్ క్యారెక్టర్‌తో పోల్చడం సరికాదు. అలాగే 'పులిమ్రుగ్గు' నవలను ప్రస్తావిస్తూ, "వీటిని చారిత్రక నవలలుగా అస్సలు పరిగణించకూడదు, తనకి నచ్చిన కథ రాసుకున్నారు, అచ్చంగా కాశీమజిలీ కథల్లాగే చదవాలి" అనడం విశ్వనాథ వారి చారిత్రక నవలా నేపథ్యాన్ని విస్మరించడమే. విశ్వనాథ వారు 'పురాణవైరి గ్రంథమాల' రాయడానికి ఆ నాటి వలసవాద చరిత్ర రచనా విధానం ఒక ప్రధాన కారణం. బ్రిటిష్ చరిత్రకారులు భారతీయ పురాణాల్లోని రాజవంశాల కాలాన్ని కుదించి రాశారనే బలమైన అభిప్రాయంతో, పురాణాల ఆధారంగా చరిత్రను పునర్నిర్మించాలనే ఉద్దేశంతో ఆయన ఆ నవలలు రాశారు. ఆయన ఎంచుకున్న చారిత్రక ఆధారాలతో మనం ఏకీభవించకపోయినా, ఆ రచనల వెనుక ఒక నిర్దిష్టమైన సైద్ధాంతిక లక్ష్యం ఉందనేది వాస్తవం. ఆయన ధర్మాధర్మ విశ్లేషణలను "ఓపిగ్గా భరించాలి" అనడం నేటి తరం పాఠకుల అభిరుచిలో వచ్చిన మార్పు సూచిస్తుంది. కథా వేగానికి ప్రాధాన్యమిచ్చే ఆధునిక పాఠకులకు ఆ తాత్విక చర్చలు భారంగా అనిపించవచ్చు కానీ, ఆ విశ్లేషణలే విశ్వనాథ రచనా శైలికి ఆధారం. 'చెలియలికట్ట' నవలలోని సంభాషణలను ఉటంకిస్తూ, విశ్వనాథ వారు '=ఘఎఱుశ్రీ జూబతీఱ్ఎ' (జాతి స్వచ్ఛత) గురించి రాశారని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. ఇక్కడ పాశ్చాత్య ప్రపంచంలోని 'రేసిజం' (జాతి వివక్ష) అనే భావనను, నాటి భారతీయ సాంప్రదాయంలోని వర్ణ వ్యవస్థ ప్రస్తావనను ఒకే గాటన కట్టడం చారిత్రక తప్పిదమవుతుంది. విశ్వనాథ ఆ నవలలో సంప్రదాయ కుటుంబ వ్యవస్థ, వివాహ బంధం, సంయమనం లేని వ్యక్తిగత స్వేచ్ఛ వల్ల వచ్చే పరిణామాలను తన దృక్కోణం నుండి చర్చించారు. అంతేకాక, ఒక నవలలో పాత్రల స్వభావాన్ని బట్టి వచ్చే సంభాషణలను ఆ నాటి సామాజిక పరిస్థితుల నుండే చూడాలి తప్ప, నేటి సమకాలీన పదజాలంతో కొలవడం సాహిత్య విమర్శలో సరైన పద్ధతి కాదు. "తన రచనలు భవిష్యత్ తరాల వాళ్ళు చదవకుండా గ్రాంథికంలో రాసి ఆయనే జాగ్రత్తపడ్డాడు. వాటిని సులభ వ్యవహారికంలోకి మార్చే ప్రయత్నం వారి వారసులు చేస్తారనైతే అనుకోవడం లేదు" అనే వ్యాఖ్యలో రచయిత శైలి పట్ల అసహనం కనిపిస్తోంది. విశ్వనాథ నవలల్లో వాడింది కఠిన గ్రాంథికం కాదు, కథా కాలానికి తగిన గాంభీర్యాన్ని ఇచ్చే ప్రౌఢ వ్యవహారిక శైలి. ఏ రచయితకైనా భాషా శైలి అనేది వారి సొంత ముద్ర. షేక్స్‌పియర్ ఇంగ్లీషు కష్టంగా ఉందని దాన్ని నేటి వాడుక భాషలోకి మార్చితే ఆ నాటకాల గాంభీర్యం దెబ్బతింటుంది. అలాగే విశ్వనాథ వారి వాక్య నిర్మాణంలోనే ఆ పాత్రల జీవం, ఆ కాలానికి చెందిన వాతావరణం ఉంటాయి. పాఠకుడే రచయిత శైలికి అలవాటు పడాలి కానీ, క్లాసిక్ రచనలను సులభ వ్యవహారికంలోకి మార్చాలనుకోవడం ఆ రచనల మూల స్వరూపాన్ని దెబ్బతీయడమే అవుతుంది. వ్యాసం చివరలో "ఆయన అంత రచయిత ముందు, తర్వాతా లేరు" అంటూనే, "ఇంకో విశ్వనాథని తట్టుకోవడం కష్టం" అని ముగించారు. సంక్లిష్టమైన తాత్విక చర్చల కంటే వేగవంతమైన కథనాన్ని ఇష్టపడే నేటి తరానికి జీవితాన్ని, ధర్మాన్ని, మానవ స్వభావపు లోతుల్ని తనదైన శైలిలో సుదీర్ఘంగా చర్చించే విశ్వనాథ రచనలు ఒకింత భారంగా అనిపించడం సహజమే. విశ్వనాథ సత్యనారాయణ గారిని చదవడం అంటే కేవలం పేజీలు తిప్పడం కాదు; అది ఒక భిన్నమైన తాత్విక ప్రపంచంలోకి ప్రవేశించడం. ఆయన సామాజిక, సాంప్రదాయక దృక్పథాలతో నేటి తరం ఏకీభవించకపోవచ్చు..

చదువులకు తగిన పునాదులేవీ?



మన దేశంలో పిల్లలు బడికి వెళ్తున్నారు. పాఠ్యపుస్తకాలు చదువుతున్నారు. హోమ్‌వర్క్ చేస్తున్నారు. పరీక్షలు రాస్తున్నారు. అయినా చాలామంది చిన్న పాఠాన్ని కూడా సరిగా చదవలేకపోతున్నారు. అయిదేళ్లు బడికి వెళ్లిన తర్వాత కూడా సగానికిపైగా పిల్లలు రెండో తరగతి పాఠాన్ని సులభంగా చదవలేకపోతున్నారు. తరగతులు, పుస్తకాలు, హోమ్‌వర్క్‌లు, పరీక్షలు, మార్కుల పేరిట ఇంత హడావుడి జరుగుతున్నా ఫలితాలు ఎందుకింత నిరాశాజనకంగా ఉంటున్నాయి? కొన్నేళ్ల క్రితం ఒక విందులో జరిగిన సంఘటన నాకింకా గుర్తుంది. ఆ విందుకు నా మిత్రుడు తన అయిదేళ్ల కుమార్తెను తీసుకొచ్చారు. వాళ్ల మాతృభాష హిందీ. హిందీ సినిమా పాటలతో అంత్యాక్షరి మొదలుపెట్టారు. ఒకవైపు ఆ చిన్నారి; మరోవైపు పాత, కొత్త పాటలు బాగా తెలిసిన పెద్దలున్నారు. పోటీ కొద్ది నిమిషాల్లో ముగిసిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ, ఏ అక్షరం ఇచ్చినా ఆ చిన్నారి వెంటనే దానితో మొదలయ్యే పాటను అందుకుంది. ఒక పాట ముగిసేలోపే మరో పాట ఆమె జ్ఞాపకంలో సిద్ధంగా ఉంది. చివరికి పెద్దల బృందమే ఓడిపోయింది. ఆ చిన్నారికి ఎన్ని వేల హిందీ పదాలు తెలిసి ఉండాలి? ఎన్ని పాటలు, పల్లవులు, చరణాలు, స్వరాలు జ్ఞాపకంలో నిలిచి ఉండాలి? ఒక పాట చివరి శబ్దాన్ని గుర్తించి, దానితో మొదలయ్యే మరో పాటను క్షణాల్లో జ్ఞాపకం తెచ్చుకోవాలంటే భాష, శబ్దం, జ్ఞాపకశక్తి ఎంత అద్భుతంగా కలిసి పనిచేయాలి! ఆ పాటలను ఆమె పుస్తకంలో చదివి నేర్చుకోలేదు. ఎవరూ పాఠాలుగా బోధించలేదు. హోమ్‌వర్క్ లేదు, పరీక్ష లేదు. ఆమె పదే పదే, ఆనందంగా విన్నది. పాటలతో పాటు పదాలను, శబ్దాలను, వాక్య నిర్మాణాన్ని, లయను, భావాన్ని తనలో నింపుకొంది. అదే మౌఖిక భాషకున్న శక్తి!

పెద్దల ఒడికి దూరమై...

చదవడమంటే అక్షరాలను శబ్దాలుగా మార్చడం మాత్రమే కాదు. ఆ శబ్దాలు మోసుకొచ్చే అర్థాన్ని గ్రహించడం; వాక్యం చూపించే ప్రపంచాన్ని మనసులో ఊహించుకోవడం. ఉదాహరణకు 'నది' అనే పదాన్ని తీసుకుందాం. నదుల గురించి కథలు విన్న పిల్లలకు, నదిని చూసిన పిల్లలకు, వానలు, వరదలు, పడవలు, చేపల గురించి పెద్దలు మాట్లాడగా విన్న పిల్లలకు అది కేవలం రెండు అక్షరాలు కాదు. వారి మనసుల్లో నది అనే పదం ఒక విశాలమైన ప్రపంచాన్ని చూపిస్తుంది. అలాంటి అనుభవం లేని పిల్లలు 'నది' అనే పదాన్ని సరిగా పలకవచ్చు. కానీ అది వారి మనసులో ఏ ప్రపంచాన్నీ చూపించకపోవచ్చు. చదవడం రావాలంటే, చదివింది అర్థం కావాలంటే పిల్లల మనసుల్లో అప్పటికే పదాలు, భావాలు, బొమ్మలు, అనుభవాలతో నిండిన సంపద ఉండాలి. ఒకప్పుడు భారతీయ కుటుంబాల్లో ఈ పునాది సహజంగానే ఏర్పడేది. అమ్మమ్మ ఒడిలో కథలు, తాతయ్య చెప్పే గాథలు, అమ్మ పాడే జోలపాటలు, పద్యాలు, సామెతలు, పొడుపు కథలు, ఆటపాటలు–అక్షరాలు నేర్చుకోవడానికి ముందే పిల్లలు వేలాది పదాలను వినేవారు. వాటి అర్థాన్నే కాదు; లయను, నాదాన్ని, సందర్భాన్ని, భావాన్ని కూడా గ్రహించేవారు. ఈ వాతావరణంలో పెరిగిన పిల్లలకు పాఠ్యపుస్తకాలు పరాయి భాషలో ఉండవు. అవి వారి ఇంట్లో వినిపించే మాటలకు, చూసే ప్రపంచానికి కొనసాగింపుగా ఉంటాయి. కానీ ఇప్పుడు ఈ పునాది చాలా బలహీనపడింది. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. అమ్మమ్మ, తాతయ్యలు పిల్లలకు దూరమయ్యారు. పిల్లలు ఎక్కువ సమయం తెరలకు అతుక్కుపోతున్నారు. ఇంట్లో మాట్లాడే భాష, పాఠశాలలో నేర్చుకోవాల్సిన భాష వేర్వేరుగా మారిపోయాయి. ఫలితంగా పిల్లలు పదాలను గుర్తుపట్టడం, అర్థం చేసుకోవడం, వాక్యాలను అల్లడం కష్టంగా మారుతోంది. ఇది ఒక్క ఇంటి సమస్య కాదు; ఒక సమాజం తన భవిష్యత్తుకు వేస్తున్న ప్రశ్నార్థకం.

కథల వైపు తిరుగుదాం

ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారం మన ఇళ్లల్లో ఒకప్పుడు సహజంగా ఉన్న మౌఖిక సంస్కృతిని తిరిగి తీసుకురావడమే. చిన్న వయసులోనే పిల్లల చేతుల్లో పుస్తకాలు పెట్టడానికి తొందరపడకుండా, కథలు చెప్పాలి; పాటలు, పద్యాలు వినిపించాలి; పొడుపు కథలు అడగాలి. వాళ్లతో మాట్లాడించాలి. ముఖ్యంగా పిల్లలు చెప్పేది వినాలి. ప్రతి భారతీయ భాషలోనూ ఆ ప్రాంతంలో పుట్టిన కథలు, పద్యాలు, సామెతలు, పొడుపు కథలు ఎన్నో ఉన్నాయి. అవి పిల్లలకు పరిచయం కావాలి. ఎందుకంటే భాష కేవలం సమాచార వాహనం కాదు. ఒక సమాజపు జ్ఞాపకాన్ని, హాస్యాన్ని, ఊహాశక్తిని, ప్రపంచ దృష్టిని తనలో మోసుకొస్తుంది. పిల్లలు సొంతంగా చదవడం నేర్చుకోకముందే ఇతిహాసాలు వినగలరు; ప్రకృతి గురించి ఆలోచించి అబ్బురపడగలరు; లోతైన ప్రశ్నలు అడగగలరు. జ్ఞానం పెరగాలంటే అక్షరాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ముందుగా పిల్లల మనసుల్లో కథలు, పాటలు, సంభాషణలతో భాషా ప్రపంచాన్ని నిర్మించాలి. ఆ తర్వాత అక్షరాలు వస్తే చదవడం యాంత్రికమైన కసరత్తుగా మిగిలిపోదు. పిల్లల చేతుల్లో పుస్తకం పెట్టేముందు, వారి మనసుల్లో భాషా ప్రపంచాన్ని నిర్మిద్దాం. అక్షరాలకు ముందు భాష– అదే అసలైన అక్షరాస్యతకు తొలి మెట్టు.

పాక్ పాత్రధారిగా మరో కూటమి



పాకిస్థాన్ భాగస్వామ్య పక్షంగా అంతర్జాతీయ యవనికపై మరో కూటమి అవతరించింది. రక్షణ రంగంలో పరస్పర సహకారం పెంపొందించుకునేందుకు పాక్‌తో తుర్కియే, ఖతార్, ఇండోనేసియా చేతులు కలిపాయి. దోహా వేదికగా ఇటీవలే 'బదర్' అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. అత్యాధునిక ఆయుధ వ్యవస్థల అభివృద్ధి, ఉత్పత్తిలో స్వావలంబనే తమ ఒప్పందం లక్ష్యమని అవి చెబుతున్నాయి. అమెరికా–ఇరాన్ యుద్ధం ఇంకా ముగియలేదు. సౌదీ అరేబియా, హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు పశ్చిమాసియాను కుదిపేస్తున్నాయి. మరోవైపు.. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉంది. ఈ భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, వాటి పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ పలు దేశాలు పంథా మారుస్తున్నాయి. అమెరికా, రష్యా వంటి అగ్ర శక్తులపై ఆధారపడకుండా, రక్షణ రంగంలో స్వీయ సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నాయి. బదర్ ఒప్పందమూ ఆ కోవలోదే. పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, ఇండోనేసియా ప్రస్తుతం రక్షణ ఉత్పత్తుల కోసం ప్రధానంగా పశ్చిమ దేశాలపైనే ఆధారపడుతున్నాయి. శత్రు భీకర యుద్ధవిమానాలు, ట్యాంకులు, యుద్ధనౌకలను సొంతంగా తయారుచేసుకునే సత్తా వాటికి లేదు. ఈ బలహీనతను అధిగమించేందుకు తమ కూటమి బాటలు పరుస్తుందని అవి విశ్వసిస్తున్నాయి.

ఉమ్మడిగా అభివృద్ధి... ఉత్పత్తి

రక్షణ రంగంలో పరిశోధన–అభివృద్ధి, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడం బదర్ ఎంఓయూ ప్రధాన ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఇస్లామాబాద్, అంకారా, దోహా, జకార్తా తమ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ఆయుధ వ్యవస్థలను ఉమ్మడిగా అభివృద్ధి చేసుకోవడంపై దృష్టిపెడతాయి. పరస్పర సహకారంతో వాటిని ఉత్పత్తి చేసుకుంటాయి. ఇందుకోసం తమ రక్షణ పరిశ్రమలను అనుసంధానించుకుంటాయి. సరఫరా గొలుసులను బలోపేతం చేసుకుంటాయి. ఈ ఒప్పందంతో ఆ నాలుగు దేశాలకు రక్షణ రంగంలో దిగుమతుల భారం తగ్గుతుంది. ఆయుధ వ్యవస్థల మెయింటెనెన్స్, మందుగుండు సామగ్రి, సాంకేతికతల కోసం పశ్చిమ దేశాలపై ఆధారపడటం తప్పుతుంది. 'బదర్' అంటే అరబిక్ భాషలో 'పూర్ణ చంద్రుడు'/'నిండు పున్నమి' అని అర్థం. రక్షణ ఉత్పత్తుల విషయంలో అలా సహకరించుకుంటామన్న సంకేతాలిస్తూ తమ ఒప్పందానికి ఆ పేరు పెట్టాయవి. తుర్కియే నాటో సభ్య దేశం. డ్రోన్లు, ఎలక్ట్రానిక్ యుద్ధ సాధనాలను జోరుగా ఉత్పత్తి చేస్తోంది. కానీ యుద్ధవిమానాలు, ట్యాంకులు, యుద్ధ నౌకల కోసం ఇప్పటికీ అమెరికా, ఐరోపా దేశాలపైనే ఆధారపడుతోంది. ఖతార్ ఆర్థికంగా బలమైనది. అయితే, దేశీయంగా సరైన రక్షణ ఉత్పత్తుల పరిశ్రమ లేదు! వాషింగ్టన్ నుంచి దిగుమతులే ఖతార్ భద్రతకు ప్రధాన ఆధారం. పాకిస్థాన్ పరిస్థితీ అంతే! యుద్ధవిమానాలను వంద శాతం స్వదేశీ సాంకేతికతతో ఇప్పటివరకూ తయారుచేసుకోలేకపోయింది. అత్యాధునిక ఆయుధ వ్యవస్థల కోసం అమెరికా, చైనా వంటి దేశాల వైపే చూస్తోంది. ఇండోనేసియాకు మానవ వనరులు అధికంగా అందుబాటులో ఉన్నాయి. ఏ అగ్రరాజ్యంతోనూ అతి సన్నిహితంగా మెలగకుండా వ్యూహాత్మక స్వతంత్రత పాటిస్తోంది. ఇప్పటికిప్పుడు జకార్తాకు వేరే దేశాల నుంచి పొంచి ఉన్న ముప్పేమీ లేదు. కానీ, దేశీయంగా రక్షణ పరిశ్రమ బలహీనం. ఈ నేపథ్యంలో తమ నైపుణ్యాలూ అనుకూలతలను వ్యూహాత్మకంగా సద్వినియోగం చేసుకుంటూ, లోపాలను అధిగమిస్తూ, రక్షణ రంగంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలన్న లక్ష్యంతో ఈ నాలుగు దేశాలు చేతులు కలిపినట్లు కనిపిస్తోంది. తుర్కియే, సౌదీ అరేబియాలతో పాక్ మొన్నామధ్య మక్కా ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు 'బదర్'నూ పట్టాలెక్కించింది. ఇది దిల్లీని కలవరపెట్టే విషయమేనని కొంతమంది భావిస్తుండొచ్చు. కానీ, ఇక్కడ గమనించాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. మక్కా ఒప్పందంతో అంకారా–ఇస్లామాబాద్–రియాద్ సైనిక కూటమిగా అవతరించాయి. వాటిలో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా మిగతా రెండింటిపైనా దాడి జరిగినట్లేనని భావించడం ఆ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. కానీ 'బదర్' సైనిక కూటమి కాదు. ఇందులోని భాగస్వాములు ఒకరికోసం మరొకరు యుద్ధాలకు దిగరు. ఇది రక్షణ రంగంలో పారిశ్రామిక ఒప్పందం వంటిదంతే!

బిల్లీ కన్నేసి ఉంచాలి

'బదర్' పూర్తిస్థాయిలో సఫలీకృతమైతే.. పాక్ తన మిలిటరీ సామర్థ్యాలను పెంచుకునేందుకు దోహదపడొచ్చు. తుర్కియే సహకారంతో అత్యాధునిక డ్రోన్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సాధనాలు, సెన్సర్లు, ఇతర ఆయుధాలను పొందొచ్చు. పాక్ సాయుధ బలగాల ఆధునికీకరణ ప్రయత్నాలు వేగవంతం కావొచ్చు. అక్కడి రక్షణ పరిశ్రమ బలపడొచ్చు. ఈ కోణాల్లో 'బదర్'పై దిల్లీ కన్నేసి ఉంచడం ఖాయం. అంతేతప్ప ఆ ఒప్పందంతో మన దేశానికి పొంచి ఉన్న ముప్పేమీ లేదు. ఖతార్, ఇండోనేసియాలతో ఇండియాకు సత్సంబంధాలే ఉన్నాయి. జకార్తాకు బ్రహ్మోస్, అస్త్ర క్షిపణులను సరఫరా చేసేందుకు దిల్లీ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. ఆ క్షిపణులకు సంబంధించిన సాంకేతికత బదిలీకి భారత్ అంగీకరించలేదు. కాబట్టి ఇండోనేసియాతో పాక్ జట్టు కట్టినా.. మన క్షిపణుల గుట్టు దాయాది చేతికి చిక్కుతుందేమోనని గుబులు పడనక్కర్లేదు. కాబట్టి, 'బదర్' గురించి ఆందోళన చెందకుండా... రక్షణ రంగంలో ఉత్పత్తి సామర్థ్యాలను మరింత పెంపొందించుకోవడంపై, ఆధునిక సాంకేతికతల అభివృద్ధిపై ఇండియా దృష్టిపెట్టే అవకాశాలే ఎక్కువ.

తెలంగాణాకు నీటి సంక్షోభం.. ప్రభుత్వానికి పరీక్ష!



తెలంగాణలో రాబోయే నీటి సంక్షోభం కేవలం ప్రకృతి వైపరీత్యం కాదు. అది ప్రభుత్వ పాలనా సామర్థ్యానికి, వ్యవసాయ విధానాలకు, ప్రజల జీవన భద్రతకు ఎదురయ్యే కీలక పరీక్ష. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగి, జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణిస్తే సాగునీరు, తాగునీరు రెండింటికీ తీవ్రమైన ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయానికి ముప్పు..

తెలంగాణ వ్యవసాయం వర్షాలు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాలపై ఆధారపడి ఉంది. వర్షాలు తగ్గితే చెరువులు నిండవు. జలాశయాల్లో నిల్వలు పడిపోతాయి. బోర్లు ఎండిపోతాయి. ఇప్పటికే నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. వరి వంటి అధిక నీటి వినియోగ పంటలను విచక్షణ లేకుండా సాగు చేస్తే అందుబాటులో ఉన్న నీరు వేగంగా ఖాళీ అవుతుంది. పంటలు ఎండిపోవడం, పెట్టుబడులు నష్టపోవడం, అప్పులు పెరగడం, వ్యవసాయ కూలీలకు ఉపాధి తగ్గడం వంటి పరిణామాలు గ్రామీణ జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టవచ్చు.

తాగునీటి సమస్య మరింత తీవ్రమైతే..!

సాగునీటి కొరతతో పోలిస్తే తాగునీటి సమస్య ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. పట్టణాల్లో జలాశయాలు, నదుల నుంచి నీటి సరఫరా తగ్గితే ప్రత్యామ్నాయ వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. గ్రామాల్లో బోర్లు, చేతిపంపులు పనిచేయకపోవచ్చు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. వేసవిలో నీటి కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే మహిళలు, వృద్ధులు, పిల్లలపై అదనపు భారం పడుతుంది. నీటి నాణ్యత తగ్గితే ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల తాగునీటికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి.

మూడు నెలల ముందస్తు కార్యాచరణ...

ప్రభుత్వం సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సిద్ధపడాలి. రాబోయే మూడు నెలలను కీలకమైన సన్నద్ధత కాలంగా పరిగణించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఉన్నతస్థాయి నీటి భద్రతా సమీక్ష నిర్వహించాలి. ప్రతి జలాశయంలో ప్రస్తుతం ఎంత నీరు ఉందో తెలుసుకోవాలి. వచ్చే వేసవికి ఎంత నీరు అవసరమో లెక్కించాలి. జిల్లాలవారీగా నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలి. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన నీటి సంక్షోభ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలి. సాగునీటి శాఖ, వ్యవసాయ శాఖ, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు సమన్వయంతో పనిచేయాలి. నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను గుర్తించాలి. పనిచేయని బోర్లకు మరమ్మతులు చేయాలి. అవసరమైన చోట అదనపు నీటి నిల్వ ట్యాంకులు ఏర్పాటు చేయాలి. నీటి సరఫరాకు అవసరమైన ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలి. ప్రజలకు నీటి సరఫరా సమయాలను ప్రకటించాలి. నీటి కొరత ఉన్న గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించాలి. నీటి సరఫరా అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలి. వారానికొకసారి పరిస్థితిని సమీక్షించాలి. సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలి. ఈ విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తే వేసవిలో ప్రజలకు నీటి భరోసా కల్పించవచ్చు.

ఆరు నెలల ప్రణాళిక...

వచ్చే ఆరు నెలల కాలానికి ప్రభుత్వం నీటి వినియోగానికి ప్రాధాన్యత క్రమాన్ని ప్రకటించాలి. మొదట తాగునీరు, తరువాత పశువుల అవసరాలు, ఆపై అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయానికి కేటాయించాలి. అయితే రైతులకు అన్యాయం జరగకుండా ఆయకట్టు ప్రాంతాలకు పారదర్శకమైన నీటి పంపిణీ ప్రణాళిక ఉండాలి. నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించాలి. రైతులకు ముందుగానే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో పండే పంటలకు విత్తనాలు అందించాలి. అధిక నీటి వినియోగ పంటల సాగుపై వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకోవాలి. సాగునీటి విడుదలలో రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి.

వేసవి సంక్షోభాన్ని ఎదుర్కోవడమెలా?

గ్రామాల్లో నీటి వనరుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలి. మహిళలు, వృద్ధులు, పిల్లలకు నీటి కోసం అదనపు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయం కల్పించాలి. నీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలను పరిశీలించాలి. నీటి పంపిణీలో రాజకీయ వివక్షకు తావివ్వకూడదు. పారదర్శకత, సమన్వయం, బాధ్యతాయుతమైన పాలనతో వేసవి సంక్షోభాన్ని ఎదుర్కోవాలి.

నీటి వనరుల ఆక్రమణలు తొలగించాలి!

తెలంగాణలో ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసుకునే విధంగా చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణను విస్తరించాలి. పట్టణాల్లో వర్షపు నీటి సేకరణను ప్రోత్సహించాలి. నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి. వ్యవసాయంలో సూక్ష్మసేద్యం, నీటి పొదుపు పద్ధతులను విస్తరించాలి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం తప్పనిసరిగా వస్తుందని భావించకుండా వాతావరణ శాఖ సూచనలను సమీక్షించాలి. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను మార్చుకోవాలి.

రోగాల నయం కొరకు వస్తే కొత్త రోగాలు అంటుకుంటున్నాయి

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబర్ 2, .తమ ఒంట్లో ఉన్న రోగాలను నయం చేసుకునేందుకు సర్కారు దవఖాన కొస్తే అపరిశుభ్రం గా ఉన్న దవాఖాన పరిసరాలు తమకు కొత్త రోగాలు అంటగడుతున్నాయని కొల్లాపూర్ లోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు ప్రజలు వాపోవుతున్నారు.కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం లోని ప్రభుత్వ సివిల్ వైద్యశాల లోకి ఎంటర్ కావాలంటే అడుసు తొక్కాలి కాళ్లు కడుక్కోవాలి అన్నట్లు ఉన్నదని రోగులు తెలియజేశారు. కొల్లాపూర్ లోని ప్రభుత్వ వైద్యశాల లోకి వెళ్లేందుకు ఉన్న ప్రధాన ద్వారము మొత్తం వర్షపు నీటికి బుదదమయం గా తయారైందని బురదలో కాళ్లు పెట్టుకొని వైద్యశాలలోకి వెళ్లాల్సి వస్తుందని బురదలో దోమలు ఈగలు వాలి ఉన్న రోగాలు నయం చేసుకునేందుకు వైద్యశాలకు వచ్చే తమకు లేని కొత్త రోగాలు అంటుకుంటున్నాయని వైద్యశాలకు వచ్చే ప్రజలు రోగులు వాపో వుతున్నారు .రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతి నిత్యం వహిస్తున్న కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం లోని ప్రభుత్వ వైద్యశాలకు పట్టిన ఈ దుస్థితిని సంబంధిత అధికారులు, కొల్లాపూర్ మున్సిపాలిటీ అధికారులు గుర్తించి వైద్యశాల ప్రధాన ద్వారం ముందు మురికి నీరు వర్షపు నీరు నిలిచి ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యశాల ప్రధాన ద్వారం ముందు సిసి నిర్మాణము చేయాలని కొల్లాపూర్ వైద్యశాలకు వస్తూ ఇబ్బందులు ఇక్కట్లు పడుతున్న రోగులు ప్రజలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరువు పీడిత ప్రాంతాల పరిశీలనకు

సిపిఐ రాష్ట్ర బృందం వస్తోంది

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్, .కరువు పీడిత ప్రాంతాలను పరిశీలించడానికి నవంబర్ 4వ తేదీన సిపిఐ బృందం నాగర్ కర్నూల్ జిల్లా లో పర్యటించనున్నదని నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ తెలియజేశారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లో సోమవారం ఆయన "నేటి సత్యం" విలేఖరి యస్.పి. మల్లికార్జున సాగర్ తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో అనావృష్టితో ఏర్పడ్డ మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వం 13 మండలాలనే కరువు మండలం లు గా ప్రకటించినది కానీ జిల్లా వ్యాప్తం గా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని అనావృష్టితో పంటలు ఎండిపోతున్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షా బావ పరిస్థితుల మూలం గా నెలకొన్న కరువు పరిస్థితి క్షుణ్ణం గా పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేసి నష్టపోయిన రైతులను ఆదుకోనమే విధము గా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చికరువు పీడిత ప్రాంతాలలో ప్రత్యేక ప్యాకేజీల ద్వారా రైతులను ప్రజలను ఆదుకునేలా కార్యక్రమాల రూపొందించుకోవడానికి ఈ కరువు పరిశీలన బృందం పర్యటన చేపట్టిందని ఫయాజ్ తెలియజేసారు. నాగర్ కర్నూల్ జిల్లా లో పెద్ద ఎత్తున నీటిపారుదల ప్రాజెక్టులు ఉన్నప్పటికీ వాటిని సక్రమం గా వినియోగించు కోని ప్రభుత్వాల నిర్లక్ష్యాల తీరు వల్ల నేడు జిల్లా కరువు కౌగిలిలో నలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కరువు పరిశీలన బృందం లో సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ , సిపిఐ రాష్ట్ర నాయకులు , రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఇతర ప్రజా సంఘాల జిల్లా నాయకులు జిల్లా కార్యవర్గం కౌన్సిల్ సభ్యులందరు పాల్గొంటారని ఫయాజ్ తెలియజేశారు.

బీపీసీఎల్ ప్లాంట్ నిర్మాణ సన్నాహాలను

తక్షణమే ఉపసంహరించుకోవాలి

భూ పరిరక్షణ కొరకు పోరాటాలను ఉధృతం చేస్తాం

మారుపాక అనిల్ కుమార్ డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఎల్కతుర్తి, నవంబర్ 2హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో బీపీసీఎల్ (భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు చేస్తున్న సన్నాహాలను తక్షణమే విరమించుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దండేపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 439లో మొత్తం 170 ఎకరాల 27 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, 1992లో ఈ భూమిని 299 మంది నిరుపేదలకు పంపిణీ చేశారని అనిల్ కుమార్ తెలిపారు. భూమిలేని పేద కుటుంబాలకు జీవనాధారంగా ఉండాల్సిన ఈ భూమిపై ఇప్పుడు బీపీసీఎల్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు.భూమిలేని పేదలకు పంపిణీ చేసిన భూములను వారి నుంచి దూరం చేసే చర్యలకు ప్రభుత్వం పాల్పడకూడదని ఆయన పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పేరుతో పేదల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం భూమిని సాగు చేసుకుంటున్న వారిని గుర్తించి, అర్హులైన సాగుదారులకు చట్టబద్ధమైన స్వాధీన హక్కులు కల్పించాలని కోరారు. భూముల స్థితిగతులు, లబ్ధిదారుల హక్కులపై సమగ్ర విచారణ జరిపిన తర్వాతే ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి బీపీసీఎల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన సన్నాహాలను నిలిపివేయాలని, భూమి లబ్ధిదారులు మరియు ప్రస్తుత సాగుదారుల హక్కులకు రక్షణ కల్పించాలని మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు వారి భూముల పరిరక్షణ కోసం ఇనూరా ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామెర లక్ష్మణ్, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, బి కె యం యు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం రాజనర్సు, రేణిగుంట్ల సాంబయ్య, గడ్డం సంధ్య, జాజాల సరోజన, జన్ను లింగయ్య, మారుపాక సంపత్, గడ్డం పూల, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలుంటే తెలపండి పరిష్కరించుకోండి

(యస్.పి. మల్లికార్జున సాగర్)

కొల్లాపూర్, కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల పరిధిలోని గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే వాటిని తమ దృష్టి తెచ్చి పరిష్కరించుకోవాలని కొల్లాపూర్ విద్యుత్ శాఖ ఏడిఈ హర్షవర్ధన్ రెడ్డి, ఏ ఈ ఓ మేష్ గౌడ్ లు తెలియజేశారు.కొల్లాపూర్ లో సోమవారం వారు మాట్లాడుతూ నవంబర్ మూడవ తేదీన విద్యుత్ వినియోగ దారుల దినోత్సవం ను కొల్లాపూర్ లోని ఏడీఈ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల లోని విద్యుత్ వినియోగదారులు తమకు ఏమైనా విద్యుత్ సమస్యలుంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరింప చేసుకోవాలని కొల్లాపూర్ ఏ డి ఈ హర్షవర్ధన్ రెడ్డి, కొల్లాపూర్ పెద్దకొత్త పల్లి మండలాల ఏ ఈ ఓమేష్ గౌడ్, పెంట్లవెల్లి ఏఈ విజ్ఞాన్ కుమార్ కోడేరు ఏఈ కృష్ణకాంత్ లు విద్యుత్ వినియోగదారులకు తెలియజేశారు

నిలోఫర్ ఆసుపత్రిలో బాంబుల పేలుడు బాధిత

చిన్నారులకు పోచారం పరామర్శ

మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

కామారెడ్డి బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ శివారులోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతంలో ఆదివారం నాటు బాంబులు పేలిన ఘటనలో గాయపడిన చిన్నారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో పరామర్శించారు.పందుల వేట కోసం ఉపయోగించే పేలుడు పదార్థాలు ప్రమాదవశాత్తు పేలడంతో ఏడుగురు గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో ఇద్దరు చిన్నారులు దండ్ల అంజలి (3), దండ్ల శ్రీదేవి (5)లకు మెరుగైన వైద్యం అందించేందుకు నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.ఈ



విషయం తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న చిన్నారులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యులకు సూచించారు.చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి ఆర్ఎంఓ, ఆసుపత్రి సూపరింటెండెంట్, తాడ్కోల్ సర్పంచ్ రమేష్, మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"అందని ఆకాశం ఆరని కన్నీళ్లు"

దూరమైనా విడిపోని (చేప పక్షి) కథ

మారుపాక అనిల్ కుమార్

కొన్ని ప్రేమకథలకు కలయిక ముగింపు కాదు. విడిపోవడమే శాశ్వత జ్ఞాపకం!

ఒక అందమైన చెరువు.

భిన్నమైన జీవితాలు ప్రకృతి ఒడిలో ఒక అందమైన చెరువు ఉండేది. చుట్టూ పచ్చని చెట్లు, రంగురంగుల పూలు, చల్లని గాలులు, పక్షుల కిలకిలరావాలతో ఆ ప్రాంతమంతా ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది.ఆ చెరువులో ఎన్నో రకాల చేపలు స్వేచ్ఛగా ఈదుతూ జీవించేవి. వాటి ప్రపంచం నీరు. నీటిలోనే పుట్టడం, పెరగడం, జీవించడం, చివరకు అక్కడే తమ జీవితాన్ని ముగించడం వాటి సహజ జీవన విధానం.ఆ చెరువు ఒడ్డున ఒక పెద్ద వృక్షం ఉండేది. ఆ వృక్షం కొమ్మలపై ఎన్నో పక్షులు నివసించేవి. వాటిలో ఒక అందమైన పక్షి ఉండేది. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగరడం, చెట్ల కొమ్మలపై వాలడం, ప్రకృతిని ఆస్వాదించడం దాని జీవితంలో భాగం.ఆ చెట్టు కింద నీటికి దగ్గరగా ఒక చాప నివసించేది. అది నీటిలోనూ, నీటి ఒడ్డునా తనకు అనుకూలమైన పరిస్థితుల్లో జీవించేది.చూస్తే ఈ జీవులూ ఒకే ప్రాంతంలో నివసిస్తున్నాయి. కానీ వాటి ప్రపంచాలు మాత్రం వేరు. వాటి జీవన విధానాలు వేరు. వాటి అవసరాలు వేరు.అయితే ప్రకృతి విచిత్రమైనది. ఒకే చోట నివసించే భిన్నమైన జీవుల మధ్య కూడా అనుబంధాలను సృష్టిస్తుంది. ఆ అనుబంధం ఎప్పుడు ఎలా పుడుతుందో ఎవరికీ తెలియదు. చూపులతో మొదలైన పరిచయం:ప్రతిరోజూ ఉదయం సూర్యుడు ఉదయించగానే చెరువులోని చేపలు నీటి పైకి వచ్చి ఆడుకుంటూ ఉండేవి. అదే సమయంలో చెట్టు కొమ్మపై కూర్చున్న పక్షి వాటిని చూస్తూ ఆనందించేది.ఆ చేపల్లో ఒక చేప మాత్రం ప్రత్యేకంగా కనిపించేది. అది నీటి పైకి వచ్చి చెట్టు వైపు చూస్తూ ఉండేది. పక్షి కిలకిల రాగాలు వినగానే దాని మనసులో తెలియని ఆనందం కలిగేది.పక్షి రెక్కలు విప్పి ఆకాశంలోకి ఎగిరినప్పుడు ఆ చేప కళ్లతోనే దాన్ని అనుసరించేది. పక్షి తిరిగి వచ్చి చెట్టు కొమ్మపై వాలే వరకు దాని చూపులు ఆకాశం వైపే ఉండేవి.రోజులు గడుస్తున్న కొద్దీ ఆ చూపులు ఒక అలవాటుగా మారాయి. ఆ అలవాటు కాస్త అనుబంధమైంది. ఆ అనుబంధం చివరకు ప్రేమగా మారింది.అదే సమయంలో పక్షికి కూడా ఆ చేపపై ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. ప్రతిరోజూ తనను చూడటానికి నీటి పైకి వచ్చే ఆ చేప కోసం పక్షి ఎదురుచూడటం మొదలుపెట్టింది.ఒకరోజు చేప నీటి పైకి రాకపోతే పక్షి చెట్టు కొమ్మపై అసహనంగా అటూ ఇటూ తిరిగింది. ఆ రోజు తనకు ఏదో కోల్పోయిన భావన కలిగింది.మరుసటి రోజు చేప నీటి పైకి రాగానే పక్షి ఆనందంగా కిలకిల రాగాలు చేసింది.వాటి మధ్య మాటలు లేవు. భాష లేదు. అయినా చూపుల్లో ఎన్నో భావాలు పలికేవి.కొన్ని అనుబంధాలకు మాటలు అవసరం ఉండవు. ఒకరి ఉనికి మరొకరికి ఆనందాన్ని కలిగిస్తే చాలు అనే బావన.చేరుకోలేని ఆశ; ఆ చెట్టు కింద నివసిస్తున్న చాప ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తూ ఉండేది.చేపకు పక్షిపై ఉన్న ప్రేమను, పక్షికి చేపపై ఉన్న అభిమానాన్ని చూసేది. వాటి మధ్య ఉన్న అనుబంధం చాప మనసులో కూడా ఒక కొత్త కోరికను పుట్టించింది.తనకు కూడా ఆ పక్షి అంటే ఎంతో ఇష్టం ఏర్పడింది.చెట్టు కొమ్మపై కూర్చున్న పక్షిని దగ్గరగా చూడాలని, దాని రెక్కలను ఒక్కసారైనా తాకాలని, తన మనసులోని ప్రేమను తెలియజేయాలని కోరుకుంది.కానీ తన పరిమితులు తనకు తెలుసు.పక్షి చెట్టు మీద ఉంది. తాను నీటిలో ఉంది. మధ్యలో దూరం ఉంది. ఆ దూరాన్ని దాటడం అంత సులభం కాదు.అయినా మనసుకు ఒకసారి కోరిక పుడితే, ఆ కోరిక ముందు వాస్తవాలు చిన్నవిగా కనిపిస్తాయి.చాప కూడా తన కోరికను నెరవేర్చుకోవాలని నిర్ణయించుకుంది. ప్రాణాలను పణంగా పెట్టిన ప్రయత్నం:ఒకరోజు చెరువులో నీటి మట్టం తగ్గింది. నీరు చెట్టు కింద నుంచి కొంత దూరంగా వెళ్లిపోయింది.చాపకు ఇదే సరైన సమయమని అనిపించింది. నెమ్మదిగా నీటిని వదిలి చెట్టు వైపు పాకడం ప్రారంభించింది.మొదట్లో ప్రయాణం సులభంగానే అనిపించింది. కానీ కొంతదూరం వెళ్లగానే శరీరం అలసిపోయింది. ఎండ వేడికి శరీరం తట్టుకోలేకపోయింది. ఊపిరి తీసుకోవడం కష్టమైంది.అయినా వెనక్కి తిరగలేదు.చెట్టు మీద ఉన్న పక్షి కనిపిస్తోంది. మరికొంత దూరం వెళితే దాని దగ్గరకు చేరుకోవచ్చని ఆశపడింది.కానీ చివరకు శరీరం సహకరించలేదు. ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడింది.అప్పుడే తన పరిస్థితిని గుర్తించి తిరిగి నీటిలోకి చేరుకుంది.కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంది.కానీ మనసులోని కోరిక మాత్రం తగ్గలేదు.మరోసారి ప్రయత్నించింది. మళ్లీ విఫలమైంది. ఇంకోసారి ప్రయత్నించింది. మళ్లీ ప్రాణాపాయ స్థితి ఎదురైంది.ప్రతిసారీ చాప పడుతున్న బాధను పక్షి గమనిస్తూనే ఉంది.చాపకు పక్షిని చేరుకోవాలనే ఆరాటం. పక్షికి చాప ప్రాణాలు కోల్పోతుందనే భయం.ఒకరి ప్రేమ మరొకరికి ఆనందాన్ని ఇవ్వాల్సింది పోయి, బాధకు కారణమవుతోందని పక్షి గ్రహించింది.

పక్షి తీసుకున్న కఠినమైన నిర్ణయం:ఒక సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్నాడు. చెరువు నీటిపై ఎర్రటి కిరణాలు పరుచుకున్నాయి.చాప మళ్లీ చెట్టు వైపు పాకడానికి ప్రయత్నిస్తోంది.ఆ దృశ్యాన్ని చూసిన పక్షి హృదయం తల్లడిల్లింది "నేను ఇక్కడ ఉన్నంతకాలం ఈ చాప నన్ను చేరుకోవాలని ప్రయత్నిస్తూనే ఉంటుంది. ప్రతి ప్రయత్నంలో తన ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకుంటుంది. నా ఉనికి దానికి ఆనందం కన్నా బాధనే ఎక్కువగా కలిగిస్తోందేమో!"అని ఆలోచించింది. చివరకు ఒక నిర్ణయానికి వచ్చింది.చాపను తన ప్రేమతో బాధపెట్టడం కన్నా, దూరంగా వెళ్లిపోవడమే మంచిదని భావించింది.మరుసటి రోజు ఉదయం సూర్యోదయానికి ముందే ఆ చెట్టు కొమ్మను వదిలి రెక్కలు విప్పి దూరంగా ఎగిరిపోయింది.ఆ రోజు చెట్టు కొమ్మ ఖాళీగా ఉంది.చాప ప్రతిరోజూ చూసే పక్షి కనిపించలేదు.మొదట అది ఏదో పనిమీద వెళ్లి ఉంటుందని అనుకుంది. మధ్యాహ్నం వస్తుందేమోనని ఎదురుచూసింది. సాయంత్రం వస్తుందేమోనని ఆశపడింది.కానీ పక్షి రాలేదు.రోజులు గడిచాయి. వారాలు గడిచాయి.పక్షి తిరిగి రాలేదు.దూరమైన తర్వాత మొదలైన అసలైన బాధ:చాపకు పక్షి కనిపించకపోవడం భరించలేని బాధగా మారింది.ఒకప్పుడు తనను చేరుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసిన చాప ఇప్పుడు నీటిలోనే ఉండిపోయింది. ఇక చెట్టు వైపు వెళ్లే ప్రయత్నం చేయలేదు.తన వల్లే పక్షి వెళ్లిపోయిందని భావించింది."నేను దాని దగ్గరకు వెళ్లాలని ప్రయత్నించకపోతే బాగుండేది. నా కోరికే దాన్ని దూరం చేసిందేమో. కనీసం దూరం నుంచైనా దాన్ని చూస్తూ ఉండేదాన్ని కదా!"అని తనలో తానే బాధపడేది.అదే సమయంలో పక్షి పరిస్థితి కూడా భిన్నంగా లేదు. అది కొత్త ప్రదేశానికి వెళ్లింది. అక్కడ పచ్చని చెట్లు ఉన్నాయి. పూలు ఉన్నాయి. ఆహారం ఉంది. స్వేచ్ఛగా ఎగిరే ఆకాశం ఉంది.కానీ అక్కడ చెరువు లేదు. తనను ప్రతిరోజూ ఎదురుచూసే చాప లేదు.ఆకాశంలో ఎంత దూరం ఎగిరినా దాని మనసు మాత్రం ఆ చెరువు చుట్టూనే తిరిగేది.కొత్త చెట్టు మీద కూర్చున్నా పాత చెట్టు గుర్తుకొచ్చేది. కొత్త నీటి వనరులను చూసినా పాత చెరువు గుర్తుకొచ్చేది.ప్రతిరోజూ సాయంత్రం సూర్యుడు అస్తమించే సమయంలో ఆ పక్షి కన్నీళ్లు పెట్టుకునేది.తనను చేరుకోవడానికి చాప పడిన ఆరాటం గుర్తుకొచ్చేది."చాపను కాపాడటానికి దూరంగా వచ్చాను. కానీ దాని జ్ఞాపకాల నుంచి నేను దూరం కాలేకపోతున్నాను. దాని ప్రాణాలు కాపాడాలనుకున్నాను. కానీ దాని మనసుకు ఎంత బాధ కలిగించానో!"అని అనుకుంటూ కన్నీళ్లు కార్చేది. చేప చెప్పిన జీవిత సత్యం;ఒకరోజు చెరువులోని చేప పక్షి కనిపించకపోవడాన్ని గమనించి చాప దగ్గరకు వచ్చింది."ఏమైంది? ప్రతిరోజూ చెట్టు వైపు చూస్తూ ఉండేదానివి. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నావు?" అని అడిగింది.చాప తన బాధను చెప్పుకుంది.పక్షి వెళ్లిపోయిన విషయం, దాని కోసం తాను ఎదురుచూస్తున్న విషయం, తన వల్లే అది దూరమైందేమోననే భయం అన్నీ వివరించింది.అప్పుడు చేప ఇలా చెప్పింది:"మనకు ఇష్టమైనవారు మన దగ్గరే ఉండాలని కోరుకోవడం సహజం. కానీ వాళ్లు మన దగ్గర ఉండటం వల్ల బాధపడుతున్నారని తెలిసినప్పుడు, మన కోరికను అదుపులో పెట్టుకోవడం కూడా ప్రేమలో భాగమే.నువ్వు పక్షిని చేరుకోవాలని ప్రయత్నించావు. అది తప్పు కాదు. కానీ నీ ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకుని దాన్ని చేరుకోవాలనుకోవడం నీకు నువ్వు చేసుకున్న అన్యాయం.అలాగే పక్షి నిన్ను వదిలి వెళ్లిపోయింది. అది నిన్ను మర్చిపోయిందని కాదు. నీకు ప్రమాదం కలగకూడదని వెళ్లిపోయి ఉండవచ్చు."చాప మౌనంగా విన్నది.కానీ మనసులోని బాధ మాత్రం తగ్గలేదు. తిరిగి వచ్చిన పక్షి ఒకరోజు అనుకోకుండా ఆకాశంలో ఒక పక్షి కనిపించింది.అది నెమ్మదిగా ఎగురుతూ పాత చెట్టు వైపు వచ్చింది.అది మరెవరో కాదు. అదే పక్షి చెట్టు కొమ్మపై వాలింది. చెరువును చూసింది. ఒకప్పుడు తనను చేరుకోవాలని ప్రయత్నించిన చాప కోసం వెతికింది.చాప కూడా పక్షిని చూసింది.ఎన్నో రోజుల తర్వాత కనిపించిన పక్షిని చూసి దాని మనసు ఆనందంతో నిండిపోయింది. కానీ ఆ ఆనందంలోనే కన్నీళ్లు కూడా కలిశాయి.పక్షి కూడా చాపను చూసి భావోద్వేగానికి గురైంది .రెండూ ఒకరినొకరు చూస్తూ ఉండిపోయాయి.మాటలు లేవు. పలకరింపులు లేవు. కానీ ఆ నిశ్శబ్దంలో ఎన్నో రోజుల విరహం ఉంది.చాప మెల్లగా నీటి పైకి వచ్చింది.పక్షి చెట్టు కొమ్మ నుంచి కొంచెం కిందకు వాలి చూసింది.అయితే ఈసారి చాప పక్షిని చేరుకోవడానికి ప్రయత్నించలేదు. పక్షి కూడా తన స్థానం వదిలి వెళ్లలేదు.వాటి మధ్య దూరం అలాగే ఉంది.కానీ ఆ రోజు వాటి మనసుల్లో ఒక కొత్త అవగాహన పుట్టింది.దగ్గరగా ఉండలేకపోయినా, ఒకరి ఉనికిని మరొకరు గుర్తించుకోవచ్చని తెలుసుకున్నాయి.



చివరి సందేశం -- ప్రేమ అంటే ఏమిటి:ఆ రోజు నుంచి పక్షి అప్పుడప్పుడు ఆ చెరువు దగ్గరకు వచ్చేది. చాప కూడా నీటి పైకి వచ్చి దాన్ని చూసేది.వాటి మధ్య దూరం తగ్గలేదు. జీవన విధానాలు మారలేదు. ప్రకృతి విధించిన పరిమితులు అలాగే ఉన్నాయి.అయినా ఒకరి కోసం మరొకరు ఎదురుచూసే మనసులు మాత్రం మారలేదు.ఒకరోజు పక్షి మళ్లీ ఆకాశంలోకి ఎగిరిపోయింది.చాప దాన్ని చూస్తూ ఉండిపోయింది.పక్షి కూడా దూరంగా ఎగురుతూ ఒకసారి వెనక్కి తిరిగి చూసింది.ఆ క్షణంలో రెండింటి మనసుల్లోనూ ఒకే భావన."నిన్ను చేరుకోలేకపోయినా, నిన్ను మరచిపోలేను!"ప్రేమ అంటే ఎప్పుడూ సొంతం చేసుకోవడం కాదు. మనకు ఇష్టమైనవారి ఆనందాన్ని కోరుకోవడం కూడా ప్రేమే. కొన్నిసార్లు దూరంగా ఉండటం త్యాగం కావచ్చు. కొన్నిసార్లు ఎదురుచూడటం జీవితమంతా కావచ్చు.కానీ ప్రతి ప్రేమకథలో ఒక ప్రశ్న మిగిలిపోతుంది.కలిసి ఉండలేని మనసులు నిజంగా విడిపోయినట్టేనా?శరీరాలు దూరమైనా జ్ఞాపకాలు దగ్గరగా ఉండవచ్చు. మాటలు ఆగిపోయినా భావాలు కొనసాగవచ్చు. కలయిక లేకపోయినా ప్రేమ జీవించి ఉండవచ్చు.

ముగింపు

చెరువులో నీరు ఉన్నంతకాలం చాప జీవిస్తుంది. ఆకాశం ఉన్నంతకాలం పక్షి ఎగురుతుంది. ఆ చెరువులో చేప ఈదుతూనే ఉంటుంది.కానీ ఆ చెరువు ఒడ్డున ఒక చెట్టు, ఆ చెట్టు కొమ్మపై ఒకప్పుడు కూర్చున్న పక్షి, నీటిలోంచి దాన్ని చూస్తూ ఎదురుచూసిన చాప జ్ఞాపకాలు మాత్రం కాలంతో పాటు చెరిగిపోవు.కొన్ని ప్రేమలు కలవడానికి పుట్టవు...?కొన్ని బంధాలు కలిసి జీవించడానికి కాదు...?ఒకరి హృదయంలో మరొకరు శాశ్వతంగా నిలిచిపోవడానికి పుడతాయి!దూరం ప్రేమను చంపలేదు... కానీ కలుసుకోలేని పరిస్థితి ప్రతి రోజూ ఆ ప్రేమను కన్నీళ్లతో గుర్తు చేస్తూనే ఉంది.

క్షతగాత్రులను పరామర్శించిన

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్



కామారెడ్డి బాన్సువాడ పట్టణంలోని బాంబు పేలుడు ఘటనలో గాయపడిన క్షతగాత్రులను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు షేక్ జుబేర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ సూచనల మేరకు ఆయన క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెబుతూ, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనజాతీయ గౌరవ దివస్

వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్య్ర పోరాటంలో వారి పాత్రను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జనజాతీయ గౌరవ దివస్ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల గొప్ప చరిత్ర, వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం, త్యాగాలు, గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు.నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, గిరిజన గ్రామాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు గిరిజన చరిత్ర, స్వాతంత్య్ర పోరాటంపై వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాలు, కథలు, కవితలు, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు.అలాగే గిరిజన కళలు, చేతివృత్తులు, సంగీతం, నృత్యాలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గిరిజన ప్రముఖులు, కళాకారులను సన్మానించాలని పేర్కొన్నారు.నవంబర్ 15న భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, సీఈఓ చందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి, డీఆర్వో పాండు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాన్సువాడలో తాగునీటి సరఫరాలో

అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

నీటి సరఫరా సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు



కామారెడ్డి బాన్సువాడ పట్టణ ప్రజలకు ప్రతిరోజూ నిరంతరాయంగా, నిర్ణీత సమయానికి తాగునీరు సరఫరా చేసేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ఆదేశించారు. పట్టణంలోని అన్ని వార్డులకు సక్రమంగా నీటి సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నీటి సరఫరా విభాగం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని నీటి సరఫరా పైపులైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, ఎక్కడైనా లీకేజీలు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు వృథా కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు.మోటార్లు, పంప్‌హౌస్‌లు, వాల్వులు, ఇతర నీటి సరఫరా పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రజల నుంచి నీటి సరఫరాకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా తాగునీటిని పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, తాగునీటిని ఇతర అవసరాలకు వృథా చేయకుండా చూడాలని సూచించారు.నీటి సరఫరా విభాగం సిబ్బంది ఈ సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ఆదేశించారు.

నంది విగ్రహం ను ప్రతిష్టించక పోతే 11న ఆలయం

లోనే ఉపవాస దీక్ష చేపడతా

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్,.కుడికిల్ల గ్రామం లో గుర్తుతెలియని వ్యక్తుల చే దొంగలించబడిన నందీశ్వర విగ్రహాన్ని తిరిగి తీసుకువచ్చి ఆలయం లో ప్రతిష్టించక పోతే ఈ నెల 11న ఆలయ ఆవరణ లో ఉపవాస దీక్ష చేపడతానని భవాని దీక్షపరుడు, బిజెపి పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి ఏళ్లేని సుధాకర్ రావు పోలీసులను కొల్లాపూర్ ప్రాంత ప్రజా ప్రతినిధులను హెచ్చరించారు. కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామం లోని శివాలయం లో ఉన్న నందీశ్వర విగ్రహాన్ని దొంగిలించిన ఆలయాన్ని ఎల్లేని సుధాకర్ రావు సోమవారం రోజు రెండవ దఫా సందర్శించి పరిశీలించారు. కొల్లాపూర్ మండల పరిధి లోని కుడికిల్ల గ్రామం లోనీ శివాలయం లో ఉన్న నందీశ్వర విగ్రహాన్ని గుర్తి తెలియని వ్యక్తులు పెకిలించి అపహరించిన ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా పోలీసులు, అధికార యంత్రాంగం నిందితులను గుర్తించడం లో ఘోరం గా విఫలమయ్యారని బీజేపీ పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుధాకర్ రావు మండిపడ్డారు.కుడికిల గ్రామాన్ని సందర్శించి దేవాలయం లో గ్రామస్థులు మరియు భక్తులతో కలిసి ప్రత్యేక సమావేశం ను సుధాకర్ రావు నిర్వహించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయ ప్రతిష్టను,భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా విగ్రహాలను ధ్వంసం చేసి అపహరిస్తే అధికారులు, పోలీసులు నిందితులను గుర్తించక పోవడం సరైంది కాదన్నారు..?వెంటనే విచారణ ను వేగవంతం చేసి నిందితులను గుర్తించి పట్టుకొని వారిని కఠినం గా శిక్షించాలని లేని పక్షం లో ఈ నెల 11వ తేదీన గ్రామస్థులను కలుపుకొని నందీశ్వర విగ్రహాన్ని అపహరించుక పోయిన ఆలయం లో ఉపవాస దీక్ష చేపడుతానని భవాని దీక్షపరుడు బిజెపి పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి ఏళ్ళేని సుధాకర్ రావు పోలీసు అధికారులను కొల్లాపూర్ శాసనసభ్యులు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ను హెచ్చరించారు.ఈ సమావేశం లో బీజేపీ నాయకులు, కుడికిల్ గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,భక్తులు,భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలి బూడిదైన ఇల్లు

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబర్ 2, పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లిన ఆ కుటుంబం పై కక్ష కట్టిన విధి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపం లో ఇంటిని, ఇంటిలోని వస్తువులను కాల్చి బూడిద చేసి నిరుపేద కుటుంబీకులను వీధిపాలు చేసిన దయనీయకర దురదృష్టకర సంఘటన ఇది. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని తెలుగు వీధిలో నివాసముండే 2-14-132 ఇంటి నివాసులు ఎం. శిరీష (భర్త శివుడు) కూలి పని కోసం వెళ్లిన సమయం లో సోమవారం మధ్యాహ్నం ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇంటిలో నిలువ ఉంచుకున్న తిండి గింజలు ఇతర వస్తువులు, అలాగే కోడలు శిరీష కు తెలియకుండా ఆమె అత్త అలివేల ఇంటిలో దాచుకున్న 56 వేల రూపాయల నగదు, ఒకటిన్నర తులం బంగారు కూడా అగ్నికి ఆహుతి అయినట్లు బాధితులు శిరీష, అలివేల లు తెలియజేశారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు లేచి ఇల్లు ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయిన సంఘటన గురించి బాధితురాలు శిరీష కొల్లాపూర్ మండల తహసిల్దార్ కు సోమవారం సాయంకాలం విజ్ఞప్తి చేస్తూ, వీధిపాలైన తమకు ఆర్థిక సహాయం అందించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీవో కార్యాలయం ముందు జర్నలిస్టుల నిరసన

మండల పరిషత్ సమావేశానికి అనుమతి నిరాకరణ పై ఆగ్రహం

జర్నలిస్టుల పట్ల అధికారుల వైఖరి మారాలని డిమాండ్

ఎంపీడీవో వ్యాఖ్యలపై జర్నలిస్టుల ఆగ్రహం



నవంబర్ 2 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య నరసింహుల పేట మండల కేంద్రం మండల పరిషత్ సమావేశానికి జర్నలిస్టులను అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు మండల పరిషత్ సమావేశానికి మీడియా ప్రతినిధులకు ప్రవేశం లేదంటూ డిపిఓ ఎంపీడీవో వ్యవహరించిన తీరును జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు ప్రజా సమస్యలను ప్రభుత్వ కార్యకలాపాలు అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించే జర్నలిస్టులను సమావేశాలకు అనుమతించకపోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేశారు ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొనే సమావేశాల్లో మీడియాకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు అధికారులు తమ వైఖరిని మార్చుకొని భవిష్యత్తులో జరిగే మండల పరిషత్ సమావేశాలకు జర్నలిస్టులు అనుమతించాలని డిమాండ్ చేశారు ప్రజాస్వామ్యంలో మీడియా పాత్రను గుర్తించి జర్నలిస్టుల హక్కులను గౌరవించాలని కోరారు జర్నలిస్టుల నిరసనతో ఎంపీడీవో ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది జర్నలిస్టుల పట్ల అధికారుల వైఖరి మారాలని సమావేశాలకు మీడియాను అనుమతించాలని డిమాండ్ చేశారు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును
ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

నవంబర్ 6 చివరి గడువు.. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



నవంబర్ 2 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్యగ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో, పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఛీఖ× నాయకులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, వీలైనంత ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియలో ఎవరూ వెనుకబడిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ఓటరు నమోదు కోసం గడువు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అర్హులైన పట్టభద్రులందరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ నెల 16న కురుమూర్తి స్వామి
“ ఉద్దాల మహోత్సవం”

(యస్.పి. మల్లికార్జున సాగర్).




కొల్లాపూర్, నవంబర్ 2, .శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుండి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ నెల పది నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలలో భాగం గా 14వ తేదీ” స్వామివారి అలంకరణ మహోత్సవం” అలాగే 16వ తేదీ “ఉద్దాల మహోత్సవం” నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలియజేశారు.ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులచే ఈ నెల 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నా దాదాపు నెల రోజులపాటు శ్రీ కురుమూర్తి స్వామి జాతర మహోత్సవాలు కొనసాగుతాయి. తెలంగాణ రాష్ట్రం నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షల సంఖ్యలో భక్తులు “ఉద్దాల మహోత్సవం” ను తిలకించడానికి తండోపతండాలుగా తరలివస్తారు.

జగ్యా తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన

కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్



నవంబర్ 2 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య కురవి: మండలంలోని జగ్యా తండా గ్రామపంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా బాలగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ద్వారా అందే ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీలో మరింత పారదర్శకత, సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రాము నాయక్, కురవి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సుంచు శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు శరత్, మండల నాయకులు డాక్టర్ కరుణాకర్, జగ్యా తండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రు నాయక్, ఆలయ ధర్మకర్త శక్రు నాయక్, బాలు నాయక్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

7 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్, నవంబర్ 2, .కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం లోని కొల్లాపూర్ , కోడేరు , పెద్ద కొత్తపల్లి , పాన్ గల్, పెంట్లవెల్లి , చిన్నంబావి , వీపనగండ్ల 7 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి (బి ఆర్ఎస్) నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు విజ్ఞప్తి చేశారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అధికారులు సోమవారం నిర్వహించిన” ప్రజావాణి” కార్యక్రమం లో కొల్లాపూర్ లోని 7 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం ను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అందజేశారు.

ఈ సందర్భం గా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం, కొల్లాపూర్ శాసనసభ్యులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ ప్రాంత రైతాంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసారు అని విమర్శించారు.ఏలినో వస్తుందని వాతావరణ శాఖ , అంతర్జాతీయ సంస్థలు ముందుగానే హెచ్చరికలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వము రైతులను ఆదుకోకుండా పూర్తి గా నిర్లక్ష్యం వహించింది అని ఆయన విమర్శించారు.రైతుల సాగు భూములకు సాగునీరు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యాల మూలం గా సాగునీరు అందక పంటలు ఎండిపోయిన ప్రతి ఎకరాకు 20వేల రూపాయల నష్ట పరిహారాన్ని రైతులకు అందజేసి ఆదుకోవాలని, అలాగే ప్రజలకు ఉపాధి పనులు కల్పించి ప్రజలకు మేలు చేకూర్చాలని హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకులు కర్ణాటక టూర్ వెళ్లి నాలుగు టిఎంసిలు, ఐదు టీఎంసీలు సాగునీరు వస్తుందని ప్రకటనలు చేశారు తప్ప వస్తాయన్న ఆ టీఎంసీల నీళ్లు ఎక్కడో కాంగ్రెస్ నాయకులకు ఎరుక కావాలని హర్షవర్ధన్ రెడ్డి వ్యంగం గా వ్యాఖ్యానించారు.కరువు మండలంగా ప్రకటించి చేతులు దులుపుకోవడం కాకుండా రైతు ,కూలీలు కౌలు రైతులను ఆదుకునే విధం గా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హర్షవర్ధన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ను అందజేసిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్ష వర్ధన్ రెడ్డి తో పాటు కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బి ఆర్ఎస్ పార్టీ నాయకులు భాస్కరరావు, పెంట్లవెల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు విజయరామారావు , పెంట్లవెల్లి మాజీ సర్పంచ్ రాజేష్ , బోడబండ తాండ మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్ , జటపోలు మాజీ సర్పంచ్ కాజా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్

తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఈ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంస్థ పరిధిలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలన్నారు.బడంగ్ పేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లకు జిహెచ్ఎంసి వేతనాలు అమలు చెయ్యకపోవడం దారుణమని మండిపడ్డారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే జిహెచ్ఎంసి వేతనాలు అమలు చేయాలన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్మికులకు 8 పండుగ మరియు 15 క్యాజువల్ లీవులు అమలు చేస్తామని అధికారులు స్పెషల్ కమిషనర్ గారు గతంలో సర్కులర్ నెంబర్.1906/2026-216 ను తేది:19-06-2026 రోజు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. సర్కిల్ పరిధిలో కార్మికులకు జాతీయ పండుగ,క్యాజువల్ సెలవులను అమలు పరచాలన్నారు. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కార్మికులను నాలుగు కేటగిరీల వైజుగా కార్మికులకు అన్ స్కిల్డ్ రూ.26వేలు,సెమీ స్కిల్డ్ రూ.30 వేలు, స్కిల్డ్ రూ.36 వేలు,

మున్సిపల్ కార్మికుల మసలను పరిష్కరించాలి



హై స్కిల్డ్ రూ.42 వేలు అమలు చేయాలన్నారు.

కార్మికులకు పనిముట్లు సబ్బులు నూనెలు జూడకట్టలు సంవత్సరం కావస్తున్న ఇవ్వలేదన్నారు.కార్మికులు విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ వర్తింప చేయాలి. అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాలకు 25 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలి. మరణించిన కార్మికుల కుటుంబాలకు దాన సంస్కారాల ఖర్చులు రూ.30వేలు, 60 సంవత్సరాలు వయోపరిమితి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు.సర్కిల్ పరిధిలలో బస్తీలు విస్తరించడంతో కొత్తగా కార్మికులను పెంచాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల ఏఐటీయూసీ అధ్యక్షులు వెల్లంకి కృష్ణారెడ్డి మున్సిపల్ కార్మికులు సిహెచ్ యాదగిరి, ఎం.నరసింహా, బి రవీందర్, డి బలవంతు, అజయ్, డి నరసింహ, కిరణ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య కేసు నమోదు.




తెలకపల్లి నవంబర్ 2మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామానికి చెందిన జరుపటి శేఖర్, (28) ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ యం రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మృతుడు శేఖర్ సుమారు ఏడు సంవత్సరాల క్రితం రాకొండ గ్రామానికి చెందిన వరలక్ష్మి నీ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కూతురు కుమారుడు కలరు. గత కొంతకాలంగా శేఖర్ సంసార విషయంలో తన భార్యతో గొడవ పడుతుండేవాడు. 2 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన ఇంటి నుండి తెలకపల్లికి పోయి వస్తానని తన భార్యతో చెప్పి వెళ్లి చాలా సేపటి వరకు రాకపోయేసరికి అతని భార్య చుట్టుపక్కలంతా వెతుకుతుండగా మృతుడు తన అన్న నాగేష్ తో నాకు బ్రతకాలని లేదు నేను చనిపోతున్నానని ఫోన్ చేసినాడు అని తెలవగా మృతుడి గురించి వెతుకుతుండగా తెలకపల్లి శివారులో గల వెంచర్లో ఒక వేప చెట్టుకు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. మృతుడు సంసార విషయంలో గొడవలు వలన మనస్థాపానికి గురై తనంతటతానుగా ఉరివేసుకొని చనిపోయినాడు అని అతని భార్య జరుపటి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాగర్‌కర్నూల్ టి ఆర్ పి జిల్లా కార్యదర్శిగా
తోకల రాము యాదవ్,



పెద్దకొత్తపల్లితెలంగాణ రాజ్యాధికార పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శిగా పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన తోకల రాము యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తోకల రాము యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించి రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చూపుతున్న మార్గంలో నడుస్తూ పనిచేస్తానని పేర్కొన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ గ్రామాన పార్టీ జెండాను తీసుకెళ్లి బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తానని తెలిపారు. బీసీ వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు.తీన్మార్ మల్లన్న అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాలో పార్టీకి బలమైన పునాది వేసేందుకు నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా, నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తానని తోకల రాము యాదవ్ స్పష్టం చేశారు. చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన రాముకు జిల్లా స్థాయి బాధ్యతలు దక్కడంపై స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రెషర్ కుక్కర్‌లో వంట చేస్తున్నారా రుచి తగ్గకుండా
ఉండాలంటే ఇలా చేయాలి



ప్రెషర్ కుక్కర్‌లో వంట చేసేటప్పుడు పదార్థాలను మరీ చిన్న ముక్కలుగా తరగడం వల్ల వాటిలోని సహజమైన రుచి తగ్గిపోతుందని వంట నిపుణులు తెలిపారు. కూరగాయలు, ఇతర పదార్థాలను కొంచెం పెద్ద ముక్కలుగా కోయడం వల్ల వంట రుచిగా ఉంటుందని వారు ఒక సులభమైన చిట్కాను పంచుకున్నారు. ముఖ్యంగా ఎక్కువసేపు ఉడికించాల్సిన వంటకాల్లో ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రెషర్ కుక్కర్‌లో పదార్థాలు ఎక్కువగా ఉడికే అవకాశం ఉండడంతో వాటి అసలైన రుచి కోల్పోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు.

పెద్ద ముక్కలుగా కోయాలి..

టమాటాలు, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి వంటి పదార్థాలను మరీ చిన్నగా కాకుండా కొంచెం పెద్ద ముక్కలుగా కోయాలని సూచించారు. ముఖ్యంగా పోపు పెట్టేటప్పుడు ఉపయోగించే పదార్థాలను పెద్ద ముక్కలుగా ఉంచడం మంచిదన్నారు. ఉదాహరణకు టమాటాలను పెద్ద ముక్కలుగా కోయాలి. అల్లాన్ని కూడా చిన్నగా తురమకుండా కొంచెం పెద్ద ముక్కలుగా దంచుకోవచ్చు. ఇలా చేయడం వల్ల వంట ఉడికే సమయంలో పదార్థాల్లోని రుచులు నెమ్మదిగా బయటకు వస్తాయి. ఫలితంగా కూరకు మంచి రుచి, సువాసన లభిస్తాయి.

ఆలుగడ్డలను వండికే..

కూరలు లేదా ఎక్కువసేపు ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించాల్సిన వంటకాలు తయారుచేసేటప్పుడు ఈ చిట్కాను పాటించాలని సూచించారు. పదార్థాలను మరీ సన్నగా తరగకుండా పెద్ద ముక్కలుగా ఉంచడమే ఈ పద్ధతిలో ముఖ్యమని తెలిపారు. అలాగే గతంలోనూ వంటకు సంబంధించిన పలు సులభమైన చిట్కాలను పంచుకున్నారు. ఆలుగడ్డలను నూనెలో వేయించే ముందు వాటిపై ఉన్న నీటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. అలుగడ్డలపై తేమ ఎక్కువగా ఉంటే వేడి నూనె చిమ్మే ప్రమాదం ఉంటుందని వివరించారు.

రొమ్ము క్యాన్సర్‌కు
విజయవంతంగా చికిత్స చేస్తే మళ్లీ వస్తుందా

నిపుణులు ఏం చెబుతున్నారు..?



ప్రారంభ దశలోనే రొమ్ము క్యాన్సర్ గుర్తించి చికిత్స పొందిన మహిళలకు చికిత్స పూర్తవడం ఎంతో ఊరటనిచ్చే విషయం. శస్త్రచికిత్సతోపాటు వైద్యులు సూచించిన ఇతర చికిత్సలను పూర్తి చేసి, పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చినప్పుడు చాలామంది తిరిగి సాధారణ జీవితాన్ని ప్రారంభిస్తారు. అయితే చికిత్స పూర్తయిందంటే క్యాన్సర్ మళ్లీ వచ్చే అవకాశం పూర్తిగా తొలగిపోయినట్లేనా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. వాస్తవానికి కొందరిలో చికిత్స తర్వాత కూడా క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదం కొన్ని సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అందుకే చికిత్సతోపాటు భవిష్యత్తులో క్యాన్సర్ మళ్లీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా దృష్టి పెట్టాలి. ప్రతి మహిళ ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ రకం, తిరిగి వచ్చే ప్రమాదం ఆధారంగా చికిత్స నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆధునిక వైద్య విధానాలు ప్రతి ఒక్కరికీ తగిన చికిత్సను ఎంచుకునేందుకు సహాయపడుతున్నాయి.

చికిత్స తరువాత క్యాన్సర్ వస్తుందా..?

శస్త్రచికిత్స, రేడియేషన్, ఇతర మందుల చికిత్సలు ప్రారంభ దశ రొమ్ము క్యాన్సర్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. కణితిని తొలగించడం, శరీరంలో మిగిలి ఉండే క్యాన్సర్ కణాలను నియంత్రించడం, వ్యాధి తిరిగి వచ్చే అవకాశాన్ని తగ్గించడం వీటి ప్రధాన లక్ష్యాలు. అయినప్పటికీ కొన్నిసార్లు విజయవంతమైన చికిత్స తర్వాత కూడా క్యాన్సర్ తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. ఇది రొమ్ములో లేదా సమీప కణజాలంలో కనిపిస్తుంది. మరికొన్ని సందర్భాల్లో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. కొన్ని ప్రత్యేక రోగుల సమూహాల్లో క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదం 50 శాతం వరకు ఉన్నట్లు పరిశోధనలు వెల్లడించాయి. అయితే ఈ అంచనా ప్రతి మహిళకు వర్తించదు. ముఖ్యంగా హార్మోన్ గ్రాహకాలు పాజిటివ్‌గా ఉన్న కొన్ని రకాల రొమ్ము క్యాన్సర్లలో చికిత్స పూర్తయిన చాలా సంవత్సరాల తర్వాత కూడా తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల శస్త్రచికిత్స తర్వాత కూడా హార్మోన్ చికిత్స, కీమోథెరపీ లేదా లక్ష్యిత చికిత్సలను వైద్యులు సూచిస్తారు.

అందరిలో ఒకే విధంగా ఉండదు..

రొమ్ము క్యాన్సర్ అందరిలో ఒకే విధంగా ఉండదు. కణితి పరిమాణం, దాని స్వభావం, గ్రేడ్, శోషరస గ్రంథులకు వ్యాపించిందా లేదా వంటి అంశాలు చికిత్స నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఒకే దశలో క్యాన్సర్ గుర్తించిన ఇద్దరు మహిళలకు కూడా వేర్వేరు చికిత్సలు అవసరమవుతాయి. క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడం ఎంత ముఖ్యమో, చికిత్స సమయంలో జీవన నాణ్యతను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. అలసట, కీళ్ల నొప్పులు, నిద్రలేమి, వికారం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపిస్తాయి. ఇలాంటి ఇబ్బందులను భరించాల్సిందేనని భావించకూడదు. అవసరాన్ని బట్టి వైద్యులు మందులు, పోషకాహార సూచనలు, వ్యాయామం, కౌన్సెలింగ్ వంటి సహాయక చికిత్సలను అందిస్తారు. తగిన రోగులకు లక్ష్యిత చికిత్సలు, శస్త్రచికిత్స తర్వాత అదనపు చికిత్సలు క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..

చికిత్స పూర్తయి ఆరోగ్యంగా ఉన్నట్లు అనిపించినా వైద్యులు సూచించిన తదుపరి పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల కోలుకునే ప్రక్రియను పర్యవేక్షించడంతోపాటు చికిత్స ప్రభావాలను గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి వైద్య పరీక్షలు, రొమ్ము చిత్రీకరణ పరీక్షలు నిర్వహిస్తారు. కొత్తగా లేదా నిరంతరంగా ఏవైనా లక్షణాలు కనిపిస్తే తదుపరి అపాయింట్‌మెంట్ వరకు వేచి ఉండకుండా వైద్యులలని సంప్రదించాలి. ఆ లక్షణాలు తప్పనిసరిగా క్యాన్సర్ తిరిగి వచ్చిందని అర్థం కాదు. కానీ వాటికి కారణం తెలుసుకోవడానికి వైద్య పరీక్ష అవసరం. చికిత్స పూర్తవడం ఒక ముఖ్యమైన మైలురాయి. క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదంపై అవగాహన, సరైన వైద్య పర్యవేక్షణ, జీవన నాణ్యతపై శ్రద్ధతో మహిళలు భవిష్యత్తు గురించి స్పష్టతతో ముందుకు సాగవచ్చు. క్యాన్సర్ మళ్లీ వస్తుందనే భయంతో జీవించడం కాదు, ఆరోగ్యంపై అవగాహనతో ధైర్యంగా జీవితాన్ని కొనసాగించడమే లక్ష్యంగా ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

దేశంలో కోటి ఇళ్లు ఖాళీ అయినా అద్దెకు ఇల్లు దొరకడం లేదు అసలు కారణాలు తెలిస్తే షాకవుతారు!



భారతదేశంలోని నగరాల్లో సుమారు కోటి ఇళ్లు ఖాళీగా ఉన్నప్పటికీ పేదలకు తక్కువ అద్దెకు ఇళ్లు ఎందుకు దొరకడం లేదు? నీతి ఆయోగ్, ¸ా¯ా నివేదికలు వెల్లడించిన కారణాలు తెలుసుకోండి. అద్దెకు నివసించే కుటుంబాలలో సుమారు 80% మంది ఆర్థికంగా వెనుకబడినవారు.. భారత నగరాల్లో దాదాపు కోటి ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలు సరసమైన అద్దె గృహాలను కనుగొనడానికి ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, మెట్రో, పట్టణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో మొత్తం గృహ కొరత 50-70 మిలియన్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రో నగరాల్లో 20-30 మిలియన్లు, ఇతర పట్టణ ప్రాంతాల్లో 15-20 మిలియన్ల కొరత ఉంది. ఇదిలా ఉండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం, పట్టణ భారతదేశంలోని సుమారు 27% కుటుంబాలు అద్దె ఇళ్లలో నివసిస్తున్నాయి. NAREDCO నివేదిక ప్రకారం, అద్దెకు నివసించే కుటుంబాలలో సుమారు 80% మంది ఆర్థికంగా వెనుకబడినవారు, తక్కువ ఆదాయ వర్గాలకు చెందినవారు. ఇంటి యజమానులు తక్కువ అద్దె ఆదాయం, అద్దెకు సంబంధించిన చట్టపరమైన వివాదాలు, ఖాళీ చేయించడంలో ఎదురయ్యే ఇబ్బందులకు భయపడతారు. ఈ కారణంగానే చాలా మంది ఇంటి యజమానులు తమ ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు ఇవ్వడానికి వెనుకాడతారు. అంతేకాకుండా, పెరుగుతున్న భూమి, నిర్మాణ వ్యయాలు కొత్తగా సరసమైన గృహాలను నిర్మించడాన్ని కష్టతరం చేస్తున్నాయి. వలస కార్మికులు, పట్టణ పేదల కోసం ప్రభుత్వం సరసమైన అద్దె గృహ సముదాయం (¯ా=ఎజ) పథకాన్ని ప్రారంభించినప్పటికీ, దాని అమలు నెమ్మదిగా సాగుతోంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, భారతదేశంలోని పట్టణ ప్రాంతాలలో సుమారు 10 మిలియన్ల ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ, అద్దె గృహాల డిమాండ్, లభ్యత మధ్య గణనీయమైన అంతరం కొనసాగుతోంది. దీనికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి.

యజమానులు ఇళ్లను అద్దెకు ఇవ్వడానికి ఎందుకు ఇష్టపడటం లేదు?

ఖాళీగా ఉన్న ఇళ్లను అద్దెకు ఇవ్వకుండా అలాగే ఉంచడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని కథనం వివరిస్తోంది.

1. అద్దె ద్వారా తక్కువ ఆదాయం: సాధారణంగా భారతదేశంలోని అనేక నగరాల్లో ఒక ఇంటిని అద్దెకు ఇవ్వడం ద్వారా యజమానులకు ఏడాదికి కేవలం 2 నుంచి 3 శాతం వరకు మాత్రమే రెంటల్ యీల్డ్ లభిస్తోంది. అంటే ఆస్తి మొత్తం విలువతో పోలిస్తే అద్దె రూపంలో వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంటోంది. అందుకే కొందరు యజమానులు ఇళ్లను ఖాళీగా ఉంచడానికే మొగ్గు చూపుతున్నారు.

2. చట్టపరమైన సమస్యల భయం: అద్దెదారులతో వివాదాలు వస్తే వాటిని పరిష్కరించడం కష్టమవుతుందని కొందరు యజమానులు భావిస్తున్నారు. అద్దె ఒప్పందాలు, కోర్టు కేసులు వంటి సమస్యలు ఎదురవుతాయనే భయంతో అద్దెకు ఇవ్వడానికి వెనుకాడుతున్నారు.

3. ఇల్లు ఖాళీ చేయకపోవడం: కొంతమంది అద్దెదారులు సకాలంలో అద్దె చెల్లించకపోవడం, యజమాని కోరినప్పుడు ఇల్లు ఖాళీ చేయకపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. ఇలాంటి అనుభవాలు ఇతర యజమానుల్లోనూ ఆందోళన పెంచుతున్నాయి.

నగరాల్లో కోటి ఇళ్లు ఖాళీగా ఉన్నా అద్దె ఇళ్ల కొరత ఎందుకు?

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, దేశంలోని పట్టణ, నగర, సెమీ అర్బన్ ప్రాంతాల్లో మొత్తం 5 నుంచి 7 కోట్ల ఇళ్ల కొరత ఉన్నట్లు అంచనా. ఇందులో మె¬ట్రో నగరాల్లో 2--3 కోట్ల ఇళ్ల అవసరం ఉండగా, ఇతర పట్టణ ప్రాంతాల్లో కూడా భారీగా గృహాల కొరత ఉంది. మరోవైపు 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ భారతదేశంలోని కుటుంబాల్లో సుమారు 27 శాతం మంది అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. అంటే సొంత ఇల్లు లేని కుటుంబాలకు అద్దె గృహాలే ప్రధాన ఆధారం. ఛీూ=ఱుణ-ఱూ నివేదిక ప్రకారం అద్దె ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాల్లో దాదాపు 80 శాతం మంది ఆర్థికంగా బలహీన వర్గాలు (EWS), తక్కువ ఆదాయ వర్గాలకు (LIG) చెందినవారే. దీంతో తక్కువ అద్దెకు ఇల్లు దొరకడం అనేది ఎంతోమందికి పెద్ద సమస్యగా మారింది.

ప్రభుత్వ పథకాలు ఉన్నప్పటికీ అద్దె ఇళ్ల ధరలు ఎందుకు పెరగలేదు?

ప్రభుత్వం సెప్టెంబర్ 2020లో సరసమైన అద్దె గృహ సముదాయాల (ARHC) పథకాన్ని ప్రారంభించింది. పట్టణ పేదలు, వలస కార్మికులు, కార్మికులు, మహిళలకు సరసమైన అద్దె గృహాలను అందించడం దీని లక్ష్యం. ఈ పథకం కింద రెండు నమూనాలను అమలు చేశారు. మొదటి నమూనాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ గృహాలను అద్దె గృహాలుగా మార్చడం, రెండవ నమూనాలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల ద్వారా కొత్త అద్దె గృహాలను నిర్మించడం ఉన్నాయి.

అద్దె ఇళ్లపై ఆధారపడుతున్నది ఎవరు?

ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వలస వస్తున్న కార్మికులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు అద్దె ఇళ్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలకు సొంత ఇల్లు కొనుగోలు చేయడం సాధ్యం కావడం లేదు. ఇలాంటి వారికి తక్కువ అద్దెకు ఇల్లు దొరకకపోవడంతో నగరాల్లో జీవన వ్యయం మరింత భారంగా మారుతోంది. ఆదాయంలో ఎక్కువ భాగం ఇంటి అద్దె, ఇతర ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రభుత్వ పథకం ఉన్నా ఫలితం ఎందుకు కనిపించడం లేదు?

పట్టణ పేదలు, వలస కార్మికులు, మహిళలు, తక్కువ ఆదాయ వర్గాలకు అందుబాటు ధరల్లో అద్దె ఇళ్లు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2020 సెప్టెంబర్‌లో Affordable Rental Housing Complexes (ARHC) పథకాన్ని ప్రారంభించింది.

ఇళ్ల నిర్మాణ ఖర్చులు పెరగడానికి కారణమేంటి?

నగరాల్లో అందుబాటు ధరల్లో కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి భూముల ధరలు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. నీతి ఆయోగ్, PRS నివేదికల ప్రకారం మెట్రో, పట్టణ ప్రాంతాల్లో ఇంటి మొత్తం నిర్మాణ వ్యయంలో భూమి ధర వాటా ఏకంగా 63 శాతం వరకు ఉండవచ్చు.

దీనికి తోడు మరికొన్ని సమస్యలు ఉన్నాయి.

నగరాల్లో ఖాళీ స్థలాలు అందుబాటులో లేకపోవడం.

భవన నిర్మాణ నిబంధనలు, FAR/FSI పరిమితులు.

సిమెంట్, ఇసుక, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం.

కార్మికుల వేతనాలు అధికం కావడం.

తక్కువ ధర ఇళ్ల నిర్మాణంలో డెవలపర్లకు లాభాలు తక్కువగా ఉండటం. ఈ అంశాలన్నీ కలిసి సామాన్యులకు అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాన్ని కష్టతరం చేస్తున్నాయి. నీతి ఆయోగ్ అంచనా ప్రకారం మెట్రో నగరాల్లో 85 శాతం కుటుంబాలు సబ్సిడీ లభించినప్పటికీ 30 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉన్న ఇంటిని కూడా కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కలిగి లేవు. చివరికి సమస్య ఎక్కడుంది? దేశంలోని నగరాల్లో ఒకవైపు సుమారు కోటి ఇళ్లు ఖాళీగా ఉంటున్నాయని అంచనాలు చెబుతుంటే, మరోవైపు తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలకు అద్దె ఇళ్లు అందుబాటులో ఉండటం లేదు. ఇంటి యజమానులకు అద్దె ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం, చట్టపరమైన సమస్యల భయం, నిర్మాణ వ్యయాలు పెరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి. ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచడంతో పాటు అద్దె ఇళ్ల మార్కెట్‌లో యజమానులు,

మోసం చేసే బిల్డర్స్‌ని ఎలా గుర్తించాలి..? హౌస్ కాంట్రాక్ట్ ఇచ్చే ముందు ఇవి తెలుసుకోండి..!



కొందరు కేవలం లాభార్జన లక్ష్యంగా పనిచేస్తూ, యజమానులను మోసం చేసే ప్రయత్నం చేస్తారు. మరి ఇంటి నిర్మాణంలో బిల్డర్ మోసాలను ఎలా గుర్తించాలి? మీ నిర్మాణ ప్రయాణాన్ని సురక్షితంగా ఎలా సాగించాలో తెలుసుకుందాం.. అయితే ఈ వివరాలు అనుభవం.. ఇల్లు కట్టాలనేది చాలామందికి ఒక పెద్ద కల. అయితే ఈ ప్రక్రియలో సరైన బిల్డర్‌ను ఎంచుకోవడం, మోసాల బారి నుండి తప్పించుకోవడం చాలా కీలకమైన అంశాలు. మార్కెట్‌లో అనేక మంది కాంట్రాక్టర్లు, మేస్త్రీలు అందుబాటులో ఉన్నప్పటికీ, అందరూ నిజాయితీగా, నాణ్యతతో పనిచేయరు. కొందరు కేవలం లాభార్జన లక్ష్యంగా పనిచేస్తూ, యజమానులను మోసం చేసే ప్రయత్నం చేస్తారు. మరి ఇంటి నిర్మాణంలో బిల్డర్ మోసాలను ఎలా గుర్తించాలి? మీ నిర్మాణ ప్రయాణాన్ని సురక్షితంగా ఎలా సాగించాలో తెలుసుకుందాం.. అయితే ఈ వివరాలు అనుభవం ఉన్న బిల్డర్స్, నిర్మాణ రంగంలో ఉన్న నిపుణులు తెలిపిన వివరాల ఆధారంగా అందిస్తున్నాము.

బిల్డర్ల రకాలు, మోసాలను గుర్తించడం:

బిల్డర్లను ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు:

1. నిజాయితీపరులు: వీరు మంచి బడ్జెట్‌ను అందించి, నాణ్యతతో పనిని పూర్తిచేస్తారు. మంచి పేరు సంపాదించుకోవాలని కోరుకుంటారు.

2. లాభాపేక్షతో పనిచేసేవారు: వీరు కేవలం లాభం కోసం పనిచేస్తారు. మిమ్మల్ని ఒప్పించడానికి తక్కువ కొటేషన్లు ఇస్తారు. కానీ పనిలో రాజీపడతారు.

3. పెద్ద బిల్డర్లు: వీరు చాలా ప్రభావవంతమైన వ్యక్తులు. వీరితో మాట్లాడటం కష్టం. వీరి మోసాలు పెద్ద స్థాయిలో ఉండవచ్చు.

మీరు రెండవ రకం బిల్డర్ల పట్ల ఎక్కువగా అప్రమత్తంగా ఉండాలి. వీరు తక్కువ ధరలతో మిమ్మల్ని ఆకర్షించి, తర్వాత నాణ్యతను తగ్గించడమో లేదా అదనపు డబ్బులు అడగడమో చేస్తారు.

అగ్రిమెంట్:

మోసాలను నివారించడంలో అగ్రిమెంట్ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. చాలా మంది మోసపూరిత బిల్డర్లు అగ్రిమెంట్‌లో వివరాలను రాయకుండా తప్పించుకుంటారు.

ఒప్పందం: సిమెంట్ బ్రాండ్, రాడ్ల గేజ్, కంపెనీ, ఇటుకల రకం, పునాదుల లోతు, వెడల్పు, సెప్టిక్ ట్యాంక్ లోతు, స్లాబ్ మందం, కాలమ్స్ పరిమాణం (ఉదాహరణకు, 1.5 అడుగులు, 16 అంగుళాలు), టైల్స్ కంపెనీ, విద్యుత్ వైర్ల గేజ్ (ఉదా. మోటార్‌కు 4 ంన.ఎఎ, సీలింగ్‌కు 1.5 ంన.ఎఎ), బాల్కనీ గ్లాస్ మందం వంటి ప్రతి చిన్న వివరాలను అగ్రిమెంట్‌లో రాయించుకోండి.

బిల్డర్ ప్రతిఘటన: మీరు ఈ వివరాలను అడిగితే, బిల్డర్లు "అవన్నీ మాకు తెలుసు, చాలా ఇళ్లు కట్టాము, మీరు అడగనవసరం లేదు" అని చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎందుకంటే, అగ్రిమెంట్‌లో వివరాలు ఉంటే వారు రిస్క్‌లో పడతారు. కాబట్టి పట్టుబట్టి ప్రతి వివరానికీ స్పష్టత తీసుకోండి. మీరు క్లయింట్, వారు సర్వీస్ ప్రొవైడర్ అని గుర్తుంచుకోండి.

మార్గదర్శకత్వం: మీకు తెలిసినవారు ఎవరైనా ఇల్లు కట్టి ఉంటే, వారి అగ్రిమెంట్‌ను పరిశీలించి, మీకు అవసరమైన పాయింట్లను మీ ఒప్పందంలో చేర్చమని అడగండి.

చెల్లింపు నిబంధనలు:

డబ్బులు చెల్లించే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

దశలవారీ చెల్లింపులు: పునాదులు వేసిన తర్వాత, ప్లింత్ బీమ్, కాలమ్స్, స్లాబ్, గోడలు, ప్లాస్టింగ్ వంటి నిర్మాణ దశల వారీగా చెల్లించాల్సిన మొత్తాన్ని (శాతంలో) అగ్రిమెంట్‌లో స్పష్టంగా రాయించుకోండి. చివరి దశలో కొంత మొత్తాన్ని నిలుపుదల చేయడం మంచిది.

ఎక్కువ డబ్బు అడిగితే జాగ్రత్త: నిర్మాణ మధ్యలో బిల్డర్లు "డబ్బులు సరిపోలేదు, ఇప్పుడు ఇవ్వండి, తర్వాత సర్దుబాటు చేద్దాం" అని అడిగితే, అప్రమత్తంగా ఉండండి. మీ ఒప్పందం ప్రకారం మాత్రమే చెల్లింపులు చేయండి. వారు ఎక్కువ డబ్బులు అడుగుతున్నారంటే వారు మీ డబ్బును ఇతర ప్రాజెక్టులకు మళ్లిస్తున్నారని లేదా దుర్వినియోగం చేస్తున్నారని అర్థం.

నమ్మకం వద్దు:"నన్ను నమ్మట్లేదా?" అని బిల్డర్లు అడిగినా, మీ ఆర్థిక నియమావళికి కట్టుబడి ఉండండి. ఒప్పందంలో లేని చెల్లింపులను నిరాకరించండి.

మోసపూరిత పద్ధతులు:

కొందరు బిల్డర్లు మొదటి ఒకటి లేదా రెండు ప్రాజెక్టులను మంచిగా చేసి, నమ్మకాన్ని పెంచుకుంటారు. ఆ తర్వాత ఒకేసారి అనేక ప్రాజెక్టులను తీసుకుని, అందరి నుండి అడ్వాన్స్ డబ్బులు వసూలు చేసి, సగం పని చేసి మాయమైపోతారు. అధిక ప్రాజెక్టుల హెచ్చరిక: ఒకేసారి పదికి పైగా ఇళ్లను తీసుకునే బిల్డర్ల పట్ల జాగ్రత్తగా ఉండండి. ఇది మోసం చేయడానికి ఒక పథకం కావచ్చు. మీ బాధ్యత: ఇంటి యజమానిగా, మీ ఇంటి పనితీరును తరచుగా పర్యవేక్షించడం మీ బాధ్యత. ఆన్‌లైన్‌లో సమాచారం సేకరించండి. పక్కన ఉన్నవారితో మాట్లాడండి. బిల్డర్ చేస్తున్న పని సరైనదేనా అని ధృవీకరించుకోవాలి. మీ గ్రౌండ్ వర్క్ మీరు చేయాలి: ఇల్లు కట్టే ముందు సమగ్ర పరిశోధన, స్పష్టమైన ఒప్పంద పత్రాలు, దశలవారీ చెల్లింపులతో జాగ్రత్తగా వ్యవహరించడం ద్వారా బిల్డర్ మోసాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు.

తులం బంగారంతో నగలు చేయిస్తే ఎంత ఖర్చవుతుంది? తరుగు, మజూరీ, GST కలిపి లెక్కలివే!



నవంబర్ 1, 2026 హైదరాబాద్ బంగారం ధరల ప్రకారం తులం బంగారంతో నగలు చేయిస్తే ఎంత ఖర్చవుతుంది? తరుగు, మజూరీ, హాల్‌మార్కింగ్, GST లెక్కలు తెలుసుకోండి. అయితే బంగారం కొనుగోలు చేయాలన్నా, నగలు చేయించుకోవాలన్నా చాలామంది ముందుగా చూసేది..

బంగారం కొనుగోలు చేయాలన్నా, నగలు చేయించుకోవాలన్నా చాలామంది ముందుగా చూసేది ఆరోజు మార్కెట్‌లో ఉన్న బంగారం ధర. అయితే ఆ ధరకు అదనంగా మరికొన్ని ఛార్జీలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తరుగు (వేస్టేజ్), మజూరీ (మేకింగ్ ఛార్జీలు), హాల్‌మార్కింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటివి బిల్లులో చేరతాయి. దీంతో తులం బంగారంతో నగలు చేయించుకోవడానికి ఎంత ఖర్చవుతుందనే సందేహం చాలామందికి ఉంటుంది. మరి 2026 నవంబర్ 1 నాటి హైదరాబాద్ బంగారం ధరల ప్రకారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారంతో నగలు చేయిస్తే ఎంత బిల్లు వస్తుంది? లెక్కలతో తెలుసుకుందాం.

నవంబర్ 1న హైదరాబాద్‌లో బంగారం ధరలు

2026 నవంబర్ 1న హైదరాబాద్ మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర సుమారు రూ.12,730గా నమోదైంది. అయితే వేర్వేరు ధరల వెబ్‌సైట్లలో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. అందువల్ల నగలు చేయించే ముందు స్థానిక జ్యువెలరీ షాపులో ఆరోజు ధరను నిర్ధారించుకోవాలి. నగల తయారీకి సాధారణంగా 22 క్యారెట్ల బంగారాన్ని ఉపయోగిస్తారు. అందుకే ఇప్పుడు 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారాన్ని ప్రామాణికంగా తీసుకుని లెక్క చూద్దాం.

1. తులం బంగారానికి ఎంత తరుగు పోతుంది?

బంగారు నగలు తయారు చేసే సమయంలో డిజైన్, తయారీ విధానం, పాలిషింగ్ తదితర ప్రక్రియలను బట్టి కొంత బంగారం నష్టం జరిగినట్లు పరిగణిస్తారు. దీన్నే తరుగు లేదా వేస్టేజ్ అంటారు. సాధారణంగా నగల డిజైన్‌ను బట్టి 3 శాతం నుంచి 10 శాతం లేదా అంతకంటే ఎక్కువగా కూడా తరుగు ఛార్జీ విధించవచ్చు. ఇది ప్రతి షాపులో ఒకేలా ఉండదు.

3% అంటే 0.30 గ్రాములకు రూ. 3,819
5% 0.50 గ్రాములకు రూ. 6,365
8% 0.80 గ్రాములకు రూ.10,184
10% 1 గ్రాముకు రూ.12,730

ఉదాహరణకు 5 శాతం తరుగు విధిస్తే, 10 గ్రాముల బంగారం విలువపై అదనంగా రూ.6,365 చెల్లించాల్సి వస్తుంది. అయితే ప్రతి నగకూ ఇదే తరుగు ఉండదు. సింపుల్ చైన్, ఉంగరం వంటి వాటికి తక్కువగా ఉండొచ్చు. క్లిష్టమైన డిజైన్లు, చేతితో తయారుచేసే నగలకు ఎక్కువగా ఉండొచ్చు.

2. మజూరీ (మీఎఅఅస్త్ర జఙ్ఞుతీస్త్రవం) ఎంత ఉంటుంది?

బంగారాన్ని నగగా మార్చడానికి స్వర్ణకారులు చేసే పనికి వసూలు చేసే మొత్తాన్ని మజూరీ అంటారు. నగ డిజైన్, తయారీ సమయం, పనితనం, యంత్రాలతో తయారు చేశారా లేదా చేతితో చేశారా అనే అంశాలను బట్టి ఈ ఛార్జీలు మారుతాయి. ఉదాహరణకు గ్రాముకు రూ.300 నుంచి రూ.800 వరకు మజూరీ తీసుకుంటున్నారని అనుకుంటే 10 గ్రాములకు ఇలా ఉంటుంది.

గ్రాముకు మజూరీ	10 గ్రాములకు ఛార్జీ
రూ. 300	రూ.3,000
రూ. 400	రూ. 4,000
రూ. 500	రూ.5,000
రూ. 600	రూ.6,000
రూ. 800	రూ.8,000

సాధారణ డిజైన్లకు తక్కువ మజూరీ ఉండవచ్చు. పెళ్లి నగలు, యాంటిక్ డిజైన్లు, క్లిష్టమైన పనితనం ఉన్న ఆభరణాలకు ఎక్కువ వసూలు చేసే అవకాశం ఉంటుంది. కొన్ని షాపులు గ్రాముకు కాకుండా బంగారం విలువలో శాతంగా కూడా మజూరీ లెక్కిస్తాయి.

3. రిఫైనింగ్ ఛార్జీలు కూడా ఉంటాయా?

చాలామందికి తరుగు, మజూరీతో పాటు రిఫైనింగ్ ఛార్జీలు కూడా ఉంటాయా అనే సందేహం ఉంటుంది. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కొత్తగా బంగారం కొనుగోలు చేసి నగలు చేయించుకుంటే ప్రతి సందర్భంలోనూ ప్రత్యేకంగా రిఫైనింగ్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే పాత బంగారాన్ని కరిగించి కొత్త నగలు చేయించుకున్నప్పుడు కొన్ని షాపులు ఈ కింది ఛార్జీలు విధించవచ్చు.

పాత బంగారాన్ని కరిగించే ఛార్జీలు

బంగారం స్వచ్ఛతను పరీక్షించే ఛార్జీలు

రిఫైనింగ్ ప్రక్రియలో వచ్చే లోహ నష్టానికి సంబంధించిన తగ్గింపులు.

ఇతర ప్రాసెసింగ్ ఛార్జీలు.

ఇవి షాపును బట్టి మారుతాయి. దీనికి దేశవ్యాప్తంగా ఒకే స్థిరమైన రేటు లేదు. కాబట్టి పాత బంగారం ఇచ్చేటప్పుడు దాని నికర బరువు, స్వచ్ఛత, రిఫైనింగ్ నష్టం, వర్తించే ఛార్జీల వివరాలను ముందుగానే అడగాలి.

4. హాల్‌మార్కింగ్ ఛార్జీలు ఎంత?

బంగారు నగల స్వచ్ఛతను నిర్ధారించడానికి దీ×ూ హాల్‌మార్కింగ్ ఉపయోగపడుతుంది. హాల్‌మార్క్ ఉన్న నగలపై దీ×ూ గుర్తు, క్యారెట్ స్వచ్ఛత వివరాలు, ఆరు అంకెల ఎఖ×ణ నంబర్ ఉంటాయి. 2026 అక్టోబర్‌లో సవరించిన రేట్ల ప్రకారం బంగారు ఆభరణానికి హాల్‌మార్కింగ్ ఛార్జీ రూ.75గా ఉంది. ఒక కన్సైన్‌మెంట్‌కు కనీస ఛార్జీ రూ.200. ఈ ఛార్జీ బంగారం బరువును బట్టి కాకుండా ఆభరణాల సంఖ్యను బట్టి ఉంటుంది.

5. +ూ ఎంత చెల్లించాలి?

బంగారు నగలు కొనుగోలు చేసినప్పుడు మొత్తం లావాదేవీ విలువపై 3 శాతం +ూ చెల్లించాలి. ఇందులో బంగారం విలువ, మజూరీ వంటి ఛార్జీలు కలిపి లెక్కిస్తారు. ఉదాహరణకు బంగారం విలువ, తరుగు, మజూరీ కలిపి రూ.1,38,665 అయితే దానిపై 3 శాతం +ూ రూ.4,160 అవుతుంది (సుమారుగా).

6. తులం బంగారంతో నగలు చేయిస్తే మొత్తం ఎంత బిల్లు వస్తుంది?

ఇప్పుడు అసలు లెక్క చూద్దాం. 2026 నవంబర్ 1న హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,27,300గా తీసుకుందాం. 5 శాతం తరుగు, గ్రాముకు రూ.500 మజూరీ, ఒక నగకు రూ.75 హాల్‌మార్కింగ్ ఛార్జీ అని ఉదాహరణకు అనుకుందాం.

10 గ్రాముల 22 క్యారెట్ల బంగారు నగల అంచనా బిల్లు	
హైదరాబాద్ ధరలు నవంబర్ 1, 2026	
బంగారం విలువ (10 గ్రాములు)	రూ.1,27,300
తరుగు (5% విలువ)	రూ.6,365
మజూరీ (రూ.500 ఐ 10 గ్రాములు)	రూ.5,000
హాల్‌మార్కింగ్ (ఒక నగ)	రూ.75
మొత్తం టోటల్	రూ.1,38,740
GST (3%)	రూ.4,162
మొత్తం అంచనా ఖర్చు	రూ.1,42,902

(నోట్- ఇక్కడ అందించిన లెక్కలు కేవలం అంచనాలు మాత్రమే. ప్రాంతాలను బట్టి ధరలు, ఛార్జీలలో తేడా ఉండవచ్చు. అలాగే ఒక్కో ప్రాంతంలో ఒక్క విధంగా బంగారం ధరలు ఉంటాయి. ఆయా ప్రాంతం జీఎస్టీ, ఇతర ఛార్జీలతో మారుతూ ఉంటాయి. అందుకే ఇక్కడ అందించిన ధరలు ఇవేనని భావించవద్దని సూచిస్తున్నాము.)

కిలో వెండి ధర 10 గ్రాముల బంగారంతో సమానమవుతుందా? 57 శాతం పడిపోయిన వెండి ధరలు..!



వెండి ధరల తగ్గుదలకు అనేక కారణాలు చెబుతున్నారు. అమెరికా స్టాక్ మార్కెట్‌లో టెక్ స్టాక్‌ల అమ్మకాలు, అధిక ముడి చమురు ధరలు, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయనే భయాలు బంగారం, వెండిపై ఒత్తిడిని పెంచాయి. వెండికి ఉన్న డిమాండ్‌లో అధిక భాగం.. బంగారం, వెండి మార్కెట్లు కొంతకాలంగా నిరంతర అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. ఇటీవలి వరకు, వెండి ధరలు వేగంగా పెరుగుతూ పోయాయి. దీంతో పెట్టుబడిదారులు మంచి రాబడులను ఆశించారు. అయితే మార్కెట్ పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ధరలు క్రమంగా పడిపోతున్నాయి. ఒక కిలోగ్రాము వెండి ధరకూ, 10 గ్రాముల బంగారం ధరకూ మధ్య వ్యత్యాసం వేగంగా తగ్గిపోతున్న పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తులో ఒక కిలోగ్రాము వెండి ధర 10 గ్రాముల బంగారం ధర స్థాయికి చేరుకోగలదా?

బంగారం, వెండి ధరల మధ్య తేడా ఏమిటి?

శుక్రవారం నాడు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఅ)లో వెండి ఫ్యూచర్స్ కిలోకు రూ.10,500 మేర తగ్గి రూ.178,900కి చేరాయి. 10 గ్రాముల బంగారం ఫ్యూచర్స్ రూ.4,347 మేర తగ్గి రూ.138,419కి చేరాయి. దీనివల్ల సుమారు రూ.40,500 ధరల వ్యత్యాసం ఏర్పడింది. బంగారం ప్రస్తుత ధరకు చేరుకోవాలంటే వెండి ధర సుమారుగా 22.6% తగ్గాల్సి ఉంటుంది. అయితే, బంగారం ధర స్థిరంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది.

వెండి దాని రికార్డు స్థాయి నుండి ఎంత పడిపోయింది?

జనవరి 2026లో వీజఅలో వెండి ధర కిలోకు రూ.420,048 వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. అయితే, శుక్రవారం నాటి ధర ప్రకారం, ఇది తన గరిష్ట స్థాయి నుండి సుమారు 57% పడిపోయింది. అదే సమయంలో, జనవరిలో 10 గ్రాములకు రూ.180,779 రికార్డు ధరకు చేరుకున్న బంగారం ధర కూడా సుమారు 23% పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధరలు కూడా తీవ్రంగా పడిపోయాయి. శుక్రవారం స్పాట్ వెండి దాదాపు 6% తగ్గి ఔన్సుకు వి49కి చేరగా, బంగారం ఔన్సుకు సుమారు వి3,875 వద్ద ట్రేడవుతోంది.

వెండి ధరలు ఎందుకు పడిపోయాయి?

వెండి ధరల తగ్గుదలకు అనేక కారణాలు చెబుతున్నారు. అమెరికా స్టాక్ మార్కెట్‌లో టెక్ స్టాక్‌ల అమ్మకాలు, అధిక ముడి చమురు ధరలు, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయనే భయాలు బంగారం, వెండిపై ఒత్తిడిని పెంచాయి. వెండికి ఉన్న డిమాండ్‌లో అధిక భాగం పారిశ్రామిక అవసరాల నుండే వస్తుంది కాబట్టి, అది ఎక్కువగా నష్టపోయింది. అందువల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందనే భయాలు పెరిగినప్పుడు దాని ధర ఎక్కువగా ప్రభావితమవుతుంది.

ఆఫ్గానిస్థాన్ ప్రీమియర్ లీగ్ : వేలంలో పేరు నమోదు చేసుకున్న సీఎస్కే, ఆర్సీబీ క్రికెటర్లు!

అఫ్గానిస్థాన్ ప్రీమియర్ లీగ్? వేలం డ్రాఫ్ట్?లో ముగ్గురు భారత మాజీ క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు.



క్రికెట్ ప్రపంచంలో ఫ్రాంచైజీ క్రికెట్?కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ క్రమంలో అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశ డొమెస్టిక్ లీగ్?ను 'అఫ్ఘనిస్థాన్ ప్రీమియర్ లీగ్' ఎనిమిదేళ్ల తర్వాత పునఃప్రారంభిస్తుంది. ఈ ఏడాది సీజన్ డిసెంబర్?లో జరగనుంది. అంతకుముందు డ్రాఫ్ట్ పద్ధతిలో ఆటగాళ్లను ఎంపిక చేయనున్నారు. అయితే ఈ డ్రాఫ్ట్?లో భారత మాజీ క్రికెటర్లు ముగ్గురు తమ పేరును నమోదు చేసుకున్నారు. ఇంతకీ వాళ్లెవరంటే?

విజయ్ శంకర్

భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ అఫ్గానిస్థాన్ ప్రీమియర్ లీగ్ డ్రాఫ్ట్?లో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఐపీఎల్?లో పలు సీజన్లు ఆడిన అతడు భారత జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్?లో సత్తా చాటుకునే అవకాశాలు విజయ్?కు రాలేదు. 9 టీ20 మ్యాచ్‌ల్లో 101 పరుగులు, 5 వికెట్లు తీశాడు. ఇక 12 వన్డేల్లో 223 పరుగులు, 4 వికెట్లు పడగొట్టాడు. అయితే ఐపీఎల్?లో అతడి గణాంకాలు ఫర్వాలేదనిపించేలా ఉన్నాయి. ఐపీఎల్‌లో మొత్తం 78 మ్యాచ్‌లు ఆడిన విజయ్ శంకర్ 26.23 సగటుతో 1233 పరుగులు చేశాడు. 9 వికెట్లు కూడా తీశాడు. ప్రస్తుతం ఆయన అఫ్ఘనిస్థాన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నారు. శంకర్ ఐపీఎల్?లో చెన్నై సూపర్ కింగ్స్?కు ఆడాడు.

భరత్

ఈ లిస్ట్?లో పేరు నమోదు చేసుకున్న భారత రెండో ఆటగాడు వికెట్ కీపర్ బ్యాటర్ కేఎస్ భరత్. భరత్ భారత జట్టు తరపున 7 టెస్టుల్లో 20.29 సగటుతో 221 పరుగులు చేశారు. ఇందులో ఒక్క అర్ధ సెంచరీ కూడా సాధించలేదు. వికెట్‌కీపర్‌గా భరత్ 18 క్యాచ్‌లు పట్టడంతో పాటు ఒక స్టంపింగ్ చేశాడు. ఐపీఎల్‌లో ఆర్సీబీ, ఢిల్లీ జట్లకు ఆడాడు. మొత్తం 10 మ్యాచ్‌లు ఆడిన భరత్ 199 పరుగులు చేశాడు. 32 ఏళ్ల వయసులో ఇదే ఏడాది జూన్?లో రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇకపై అతను విదేశీ లీగ్‌లలో పాల్గొనాలనే ఉద్దేశంతో ఉన్నాడు.

మురుగన్ అశ్విన్

స్పిన్ బౌలర్ మురుగన్ అశ్విన్ కూడా ఏపీఎల్ డ్రాఫ్ట్ కోసం తన పేరును నమోదు చేసుకున్నాడు. అతడు కూడా విదేశీ లీగ్‌లలో ఆడాలని భావిస్తున్నాడు. మురుగన్ భారత జట్టు తరపున అరంగేట్రం చేయలేదు. ఐపీఎల్‌లో ఐదు వేర్వేరు ఫ్రాంచైజీల ఆర్సీబీ, ఢిల్లీ, పుణె, పంజాబ్, రాజస్థాన్)కు ప్రాతినిధ్యం వహించాడు. 44 మ్యాచ్‌లలో 35 వికెట్లు పడగొట్టాడు.

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్



వార్త అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అఫ్గానిస్థాన్ జట్టు మరో అద్భుతమైన ఘనతను సాధించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆ జట్టు ఏకంగా ఆరో స్థానానికి ఎగబాకింది.మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ ప్రస్థానంలోనే ఆల్-టైమ్ బెస్ట్ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ అరుదైన ఫీట్‌తో ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి దిగ్గజ జట్ల కంటే మెరుగైన స్థానాన్ని నిలబెట్టుకుంది.

అంచెలంచెలుగా ఎదుగుతూ.. చారిత్రక ప్రస్థానం

కేవలం 2009లోనే అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అఫ్గాన్ జట్టు, స్వల్ప కాలంలోనే అసాధారణ ప్రగతిని కనబరిచింది. ఇప్పటివరకు మొత్తం 191 వన్డే మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు, ఏకంగా 96 విజయాలను నమోదు చేసి పటిష్టమైన శక్తిగా అవతరించింది. ముఖ్యంగా పెద్ద టోర్నమెంట్లలో అఫ్గానిస్థాన్ ప్రదర్శన ప్రపంచ క్రికెట్ ను విస్మయపరిచింది. భారత్ వేదికగా జరిగిన 2023 వన్డే వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి మేటి జట్లపై సంచలన విజయాలు సాధించింది. అలాగే ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లోనూ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి తమ సత్తా ఏంటో నిరూపించుకుంది.గత కొంతకాలంగా అఫ్గానిస్థాన్ జట్టు అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ వస్తోంది. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసి సత్తా చాటింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన త్రైపాక్షిక టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి చవిచూడకుండా అజేయంగా నిలిచి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయాలే వారిని ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రగామిగా నిలబెట్టేందుకు దోహదపడ్డాయి.

టీ20 ఫార్మాట్‌లోనూ అఫ్గాన్ జోరు

కేవలం వన్డేల్లోనే కాకుండా టీ20 ఫార్మాట్‌లోనూ అఫ్గానిస్థాన్ తన హవా కొనసాగిస్తోంది. తాజాగా షార్జా వేదికగా జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే కుప్పకూల్చింది. ఈ మ్యాచ్‌లో యువ స్పిన్నర్ నూర్ అహ్మద్ కేవలం 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి తన కెరీర్‌లోనే అత్యుత్తమ గణంకాలను నమోదు చేశాడు.

అదరగొడుతున్న ఆటగాళ్లు.. బలమైన జట్టుగా ఎదుగుదల

ఈ సిరీస్‌లలో అఫ్గాన్ ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రెండో టీ20లో ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లోనే 116 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ తన ఆల్-రౌండ్ ప్రతిభతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ నిలకడైన ప్రదర్శనల ద్వారా అఫ్గానిస్థాన్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక తిరుగులేని శక్తిగా దూసుకెళ్తోంది.

సౌతాఫ్రికా జట్టు ప్రకటన.. డేంజరస్ బ్యాటర్ రీఎంట్రీ



సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన తమ జట్టును సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు ప్రకటించింది.ఈ జట్టుకు టెంబా బవుమా నాయకత్వం వహించనున్నాడు. కాగా ఆసీస్‌తో టెస్టులకు గాయం కారణంగా దూరమైన స్టార్ ఓపెనర్ టోనీ డి జోర్జీ పునరాగమనం చేశాడు. టోనీ తిరిగి రావడంతో డేవిడ్ బెడింగ్‌హామ్‌ను సెలక్టర్లు పక్కన పెట్టేశారు. అలాగే మిడిలార్డర్ బ్యాటర్ జుబేర్ హమ్జా కూడా రీఎంట్రీ ఇచ్చాడు.ఇటీవల ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శన చేసిన స్టార్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్, స్పిన్నర్ సైమన్ హార్మర్‌లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. అంతేకాకుండా తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న ఫాస్ట్ బౌలర్ ఆన్రిచ్ నోర్జే తిరిగి జట్టులోకి రావడం ప్రోటీస్ బౌలింగ్‌కు మరింత బలాన్నిచ్చింది. ప్రోటీస్ పేస్ విభాగంలో నోర్జేతో పాటు కగిసో రబాడా, డేన్ ప్యాటర్సన్, కార్బిన్ బాష్‌లకు చోటు దక్కింది.కాగా ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను సఫారీలు 2-1 తేడాతో సొంతం చేసుకున్నారు. తొలి టెస్టులో ఓటమి పాలైనప్పటికి మిగితా రెండు మ్యాచ్‌లలో సౌతాఫ్రికా సంచలన విజయాలు నమోదు చేసింది. ఇప్పుడు అదే జోరును బంగ్లాదేశ్‌పై కూడా కొనసాగించాలని సౌతాఫ్రికా పట్టుదలతో ఉంది. ఈ రెండు టెస్టుల సిరీస్ నవంబర్ 15 నుంచి ప్రారంభం కానుంది.

న్యూజిలాండ్‌కు బిగ్ షాక్- వన్డే సిరీస్? నుంచి ఇద్దరు ఔట్

వన్డే సిరీస్ ప్రారంభానికి ముందే న్యూజిలాండ్?కు ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాళ్లు ఇద్దరు సీజన్? మొత్తానికి దురమయ్యారు.




భారత్?తో వన్డే సిరీస్?కు ముందు ఆతిథ్య న్యూజిలాండ్?కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గాయాల కారణంగా స్టార్ ఆటగాళ్లు మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర సిరీస్ మొత్తానికి దూరమయ్యారు. ఈ విషయాన్ని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. సదరు ఆటగాళ్లు ఇంకా గాయాల నుంచి కోలుకుంటున్నారని, పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరికొంత సమయం పడుతుందని పేర్కొంది. దీంతో ఈ ఇద్దరినీ సిరీస్? నుంచి తప్పించినట్లు కివీస్ తెలిపింది.కాగా, తొడ కండరాలగాయంతో మార్క్ చాప్‌మన్ బాధపడుతుండగా, భుజం సమస్యతో రచిన్ రవీంద్ర ఇబ్బంది పడుతున్నాడు. దీంతో ఈ ఇద్దరిని తప్పించిన కివీస్ బోర్డు మరో ముగ్గురుని జట్టులోకి తీసుకుంది. రీసెంట్?గా భారత్?పై ఐదో టీ20లో రాణించిన టిమ్ సీఫెర్ట్ ఇప్పుడు వన్డే సిరీస్ కోసం జట్టులోకి తీసుకున్నారు. అతడు అంతకుముందు నాలుగు, ఐదు మ్యాచ్?లకు మాత్రమే ఎంపికవ్వగా, ఇప్పుడు మొత్తం సిరీస్?కు తీసుకున్నారు. అతడితోపాటు తొలి మూడు వన్డేలకు హెన్రీ నికోల్స్, చివరి రెండు మ్యాచ్?లకు డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ కు చోటు దక్కింది.

ప్రధాన కోచ్ ఏమన్నారు?

చాప్‌మన్, రవీంద్ర వన్డే సిరీస్‌కు దూరమవ్వడంపై న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ విచారం వ్యక్తం చేశారు. "జట్టులో మార్క్, రచిన్ ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. వారు ఈ సిరీస్‌లో పాల్గొనలేకపోవడం దురదృష్టకరం. గత వారం నేను మార్క్‌తో మాట్లాడాను. అతను సహజంగానే నిరాశ చెందాడు, కానీ తిరిగి మైదానంలోకి రావడానికి కష్టపడి పనిచేస్తున్నాడు. అలాగే రచిన్ పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. దీనివల్ల అతను ఫీల్డింగ్ చేయడం అసాధ్యం. ఈ నెల చివరలో టెస్టు సిరీస్ కూడా ఉండటంతో, ఈ ఇద్దరి విషయంలో మేం ఎలాంటి రిస్క్ తీసుకోవాలనుకోవడం లేదు" అని ఆయన పేర్కొన్నారు.కాగా, ఇటీవల భారత్?తో ముగిసిన టీ20 సిరీస్‌కు కూడా ఈ ఇద్దరు దూరంగా ఉన్నారు. అయితే వన్డే సిరీస్? నాటికి ఫిట్?నెస్ సాధిస్తారని భావించారు. కానీ అలా జరగకపోవడంతో వన్డేలకు కూడా దూరమయ్యారు. భారత్?తో ముగిసిన టీ20 సిరీస్? కోల్పోయినా, చివరి రెండు మ్యాచ్?ల్లో నెగ్గడంతో ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అదో జోరును 50 ఓవర్ల ఫార్మాట్‌లోనూ కొనసాగించాలని భావిస్తోంది. కానీ సిరీస్? నుంచి ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లను కోల్పోవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బ.

ఇట్స్ వన్డే టైమ్ - యాక్షన్? మోడ్?లోకి రో-కో- లైవ్ ఎక్కడ చూడాలో తెలుసా?

న్యూజిలాండ్?తో మరో రెండు రోజుల్లో వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.



న్యూజిలాండ్ గడ్డపై భారత్ మరో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఈనెల 04న వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్?లో కివీస్?తో టీమ్ఇండియా ఐదు మ్యాచ్?లు ఆడనుంది. 2027 వరల్డ్?కప్ కోసం సన్నాహంగా భావిస్తున్న క్రమంలో ఈ సిరీస్? టీమ్ఇండియాకు అత్యంత కీలకం కానుంది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగుతుండడంతో దీనిపై ఇంకాస్త ఫోకస్ ఎక్కువైంది. మరి ఈ సిరీస్ పూర్తి షెడ్యూల్ ఏంటి? జట్లలో ఎవరెవరు కీలక ఆటగాళ్లు ఉన్నారు? లైవ్ మ్యాచ్ ఎక్కడ చూడాలి? అని వివరాలు తెలుసుకుందాం!

భారత్?లో వాళ్లపై ఫోకస్

ఇదే పర్యటనలో టీ20 సిరీస్ దక్కించుకున్న టీమ్ఇండియా ఇప్పుడు వన్డే సిరీస్?కు రెడీ అయిపోయింది. గిల్ నాయకత్వంలో ఈ సిరీస్?నూ కూడా గెలవాలని భారత్ భావిస్తోంది. అయితే వన్డేలు ముగిసిన వెంటనే టెస్టు మ్యాచ్?లు ఉండడంతో గిల్, జైస్వాల్ లాంటి ప్లేయర్లను బీసీసీఐ తొలి మూడు వన్డే?లకే ఎంపిక చేసింది. విరాట్, రోహిత్ మాత్రం పూర్తి సిరీస్?కు అందుబాటులో ఉంటారు. గిల్ గైర్హాజరీలో చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. భారత్ జట్టులో సీనియర్లు రోహిత్, విరాట్?తోపాటు కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, అయ్యర్ బ్యాటింగ్?లో కీలకం కానున్నారు. బౌలింగ్?లో సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్? ఎంత మేరకు రాణిస్తారన్నది ఆసక్తి నెలకొంది.

కివీస్‌దే ముగింపు మురిపెం

న్యూజిలాండ్ పర్యటనలో టీ20 సిరీస్‌ను భారత్ ఓటమితో ముగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి ముందే సిరీస్ ్కించుకున్నా తర్వాత జరిగిన రెండు మ్యాచుల్లోనూ ఆతిథ్య జట్టు అనూహ్యంగా పుంజుకుని భారత ఆధిక్యాన్ని 3-2కు తగ్గించింది.

బంతితో చేతులెత్తేసిన భారత్

చివరి మ్యాచ్‌లో ఓడినా సిరీస్ 3-2తో కైవసం





హమిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో టీ20 సిరీస్‌ను భారత్ ఓటమితో ముగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి ముందే సిరీస్ దక్కించుకున్నా తర్వాత జరిగిన రెండు మ్యాచుల్లోనూ ఆతిథ్య జట్టు అనూహ్యంగా పుంజుకుని భారత ఆధిక్యాన్ని 3-2కు తగ్గించింది. ఆదివారం హమిల్టన్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో టీమిండియా నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని శాంట్నర్ సేన మరో రెండు ఓవర్లు మిగిలుండగానే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 93) వీరబాదుడుకు తోడు సిరీస్‌లో అత్యద్భుతమైన ఫామ్ కనబరిచిన గ్లెన్ ఫిలిప్స్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 65 నాటౌట్) అజేయ అర్ధశతకంతో మెరుపులు మెరిపించారు. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 61), శ్రేయాస్ అయ్యర్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలకు తోడు నమన్ ధీర్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 33) మెరుపులతో నిర్ణీత ఓవర్లకు 191/8 చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఆడమ్ మిల్నే (4/19) నాలుగు వికెట్లతో రాణించాడు. సిరీస్‌లో 341 రన్స్ చేసిన ఫిలిప్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది. టీ20లు ముగియగా ఈనెల 4 నుంచి వన్డే సిరీస్ మొదలుకానుంది.

సీఫర్ట్ మెరుపులు.. ఫిలిప్స్ ఫినిషింగ్ టచ్

ఈ సిరీస్‌లో 200ం లక్ష్యాలను అవలీలగా ఛేదించిన నేపథ్యంలో 192 పెద్ద కష్టమేమీ కాకపోయినా భారత బౌలర్లు ఏమైనా మాయ చేయకపోతారా? అని ఆశించిన ఇండియా ఫ్యా న్స్‌కు మరోసారి నిరాశే ఎ దురైంది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే అర్ష్‌దీప్.. ఫిన్ అలెన్ (2)ను ఔట్ చేసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టే యత్నం చేశాడు. ఐదో ఓవర్లో బంతినందుకున్న ప్రిన్స్‌కు డారిల్ మిచెల్ (29) రెండు భారీ సిక్స్‌లతో స్వాగతం పలికాడు. తొలుత 15 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేసిన సీఫర్ట్ ఆ తర్వాత జూలు విదిల్చాడు. 19 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా అర్ష్‌దీప్ బౌలింగ్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను నమన్ ధీర్ జారవిడవడంతో అయ్యర్ సేన అందుకు భారీగానే మూల్యం చెల్లించాల్సి వచ్చింది.భువీ వేసిన ఆరో ఓవర్లో 4, 6, 6, 4తో సీఫర్ట్ గేర్ మార్చాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన వరుణ్ చక్రవర్తి 9వ ఓవర్లో మిచెల్‌ను ఔట్ చేసినా భారత శిబిరంలో ఆనందం లేదు. ఫిలిప్స్‌కు జతకలిసిన సీఫర్ట్ మరింత రెచ్చిపోయాడు. మిచెల్‌తో రెండో వికెట్‌కు 73 రన్స్ జోడించిన అతడు ఫిలిప్స్‌తో మూడో వికెట్‌కు 86 పరుగులు జతచేసి మ్యాచ్‌ను తమ వైపునకు తిప్పుకున్నాడు. నితీశ్ విసిరిన పదో ఓవర్లో సిక్స్‌తో సిరీస్‌లో తొలి హాఫ్ సెంచరీ సాధించిన అతడు.. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు బాదడంతో 12 ఓవర్లకే కివీస్ 120/2తో గెలుపును దాదాపుగా ఖాయం చేసుకుంది. 16వ ఓవర్లో నితీశ్.. సీఫర్ట్‌ను క్లీన్‌బౌల్డ్ చే సినా అప్పటికే కివీస్ విజయం ఖాయమైంది. ఫిలిప్స్.. 17వ ఓవర్లో 6, 4తో ఈ సిరీస్‌లో నాలుగో అర్ధ శతకాన్ని బాదడమే గాక భువీ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు.

ఆ ఇద్దరే..

ఇషాన్, శ్రేయాస్ మెరుపులు లేకుంటే భారత్ ఆ మాత్రం స్కోరైనా చేయకపోయేది. నిలకడ లేమితో కొనసాగుతున్న సంజూ శాంసన్ (4) మరోసారి సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరగగా అభిషేక్ (1) సైతం నిరాశపరిచాడు. 19/2తో ఉన్న భారత్‌ను ఇషాన్, శ్రేయాస్ ద్వయం ఆదుకుంది. మొదట్నుంచే దూకుడుగా ఆడిన ఈ జోడీ బౌండరీలు, సిక్స్‌లతో అలరించడంతో పర్యాటక జట్టు స్కోరు రాకెట్ వేగాన్ని అందుకుంది. శాంట్నర్ ఓవర్లో ఇషాన్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకునే సమయంలో అలెన్ కాలు గ్రౌండ్‌కు తాకిందని తేలడంతో అతడు బతికిపోయాడు.ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ అతడు ఫిఫ్టీ పూర్తిచేశాడు. బ్రేస్‌వెల్ పదో ఓవర్లో అయ్యర్ హ్యాట్రిక్ సిక్స్‌లతో రెచ్చిపోగా ఇషాన్ కూడా 6, 4 కొట్టడంతో పది ఓవర్లకు 111/2తో భారత్ మెరుగ్గానే నిలిచింది. కానీ టిక్నర్ 11వ ఓవర్లో ఇషాన్‌ను ఔట్ చేయడం, ఆ వెంటనే 50 రన్స్ పూర్తయ్యాక అయ్యర్ కూడా నిష్క్రమించడంతో టీమిండియా బాదుడులో వెనుకబడింది. తిలక్ వర్మ (6) కూడా తేలిపోయాడు. నమన్ ధీర్, నితీశ్‌కుమార్ (22) మెరుపులతో భారత్ పోరాడగలిగే స్కోరు చేయగల్గింది.

నేడే న్యూజిలాండ్‌తో ఐదో టీ20


న్యూజిలాండ్ పర్యటనలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న భారత్.. ఆదివారం ఆతిథ్య జట్టుతో చివరి పోరులో ్లపడనుంది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను ్కించుకున్నా ఆక్లాండ్‌లో శాంట్నర్ సేన ఇచ్చిన షాక్ నుంచి తేరుకుని చివరి టీ20ని విజయంతో ముగించాలనే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతుంది.




నేడే న్యూజిలాండ్‌తో ఐదో టీ20సిరీస్‌లో 4-1పై కన్నేసిన టీమిండియానేడే న్యూజిలాండ్‌తో ఐదో టీ20మ. 12.30 గం. నుంచి సోనీలో..హమిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న భారత్.. ఆదివారం ఆతిథ్య జట్టుతో చివరి పోరులో తలపడనుంది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను దక్కించుకున్నా ఆక్లాండ్‌లో శాంట్నర్ సేన ఇచ్చిన షాక్ నుంచి తేరుకుని చివరి టీ20ని విజయంతో ముగించాలనే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతుంది. హమిల్టన్ వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకోవాలని శ్రేయాస్ సేన ప్రణాళికలు రచిస్తోంది. అయితే బ్యాట్‌తో బాగానే బాదుతున్నా పర్యాటక జట్టు సమస్యంతా బౌలింగ్‌తోనే ఉంది.

కుల్‌దీప్ ఆడేనా?

నాలుగేండ్ల తర్వాత జట్టులోకి వచ్చిన వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌తో పాటు పేస్ దళం సిరీస్‌లో కివీస్ బ్యాటర్లకు ధారాళంగా పరుగులిచ్చుకుంటున్నది. నాలుగు మ్యాచ్‌లలో న్యూజిలాండ్ బ్యాటర్లు రెండుసార్లు 220ం స్కోర్లు చేయగా ఒకసారి 198 బాదారంటే భారత బౌలింగ్ ఎంత నాసిరకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అర్ష్‌దీప్ ఒక్కడే ఉన్నంతలో మెరుగ్గా రాణిస్తున్నాడు.సిరీస్‌లో భారత్ నుంచి అతడి ఎకానమీ మాత్రమే 10కి తక్కువగా ఉంది. భువీ మూడు మ్యాచుల్లో 11.58తో 138 రన్స్ సమర్పించుకోగా మయాంక్, ప్రిన్స్ అదే బాటలో ఉన్నారు. అక్షర్ అయితే మూడు మ్యాచుల్లో తీసింది ఒక్క వికెటే. ఈ నేపథ్యంలో నేటి పోరులో అక్షర్, నమన్ ధీర్‌లలో ఒకరిని పక్కనబెట్టి కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలలో ఒకరికి అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తున్నది. ఇక కివీస్ విషయానికొస్తే సిరీస్ కోల్పోయినా ఆక్లాండ్ మ్యాచ్‌లో విజయం ఆ జట్టులో కొత్త జోష్ నింపింది.





వైట్ గ్లామర్‌తో మాళవిక మోహనన్.. చూపు తిప్పుకోలేరు!

సౌత్ ఇండియన్ గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ తన అందచందాలతో, స్టైలిష్ ఫొటోషూట్‌లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తుంటారు. తాజాగా ఆమె వైట్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో షేర్ చేసిన ఎలిగెంట్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. రాయల్ లుక్, క్లాసిక్ వింటేజ్ వైబ్‌తో కూడిన ఈ ఫొటోల్లో మాళవికను చూసిన నెటిజన్లు చూపు తిప్పుకోలేకపోతున్నారు. ఎంతో ప్రశాంతంగా, పొయెటిక్‌గా ఉన్న ఆ సినిమాటిక్ ఫొటోషూట్ విశేషాలు ఇప్పుడు చూద్దాం.. రాయల్ వైట్ అనార్కలీలో దేవకన్యలా: తాజా ఫొటోషూట్‌లో మాళవిక మోహనన్ ఒక కలర్‌ఫుల్ అండ్ రాయల్ వైట్ అనార్కలీ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయారు. పారదర్శకమైన షీర్ దుపట్టా, బాడీస్‌పై నాజూకైన పూల ఎంబ్రాయిడరీ మరియు సీక్విన్ వర్క్‌తో ఈ డ్రెస్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇక దీనికి తోడు ఆమె ధరించిన పెద్ద వెండి జుంకాలు, చేతికి ఉన్న సింపుల్ రింగ్స్ ఆమె సాంప్రదాయక అందానికి మరిన్ని మెరుగులు దిద్దాయి. సినిమాటిక్ లొకేషన్.. స్మోకీ ఐస్ మేకప్: పుస్తకాల షెల్ఫ్‌లు, వెచ్చని దీపాల కాంతి ఉన్న ఒక ఇండోర్ లొకేషన్‌లో ఈ ఫొటోలను షూట్ చేశారు. స్మోకీ ఐస్, నేచురల్ మేకప్, లూజ్ హెయిర్‌తో మాళవిక ఇచ్చిన రాయల్ ఫోజులు ఏదో ఒక సినిమాలోని సీన్‌ను తలపిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో క్లోజప్ క్లిక్స్ నుండి లగ్జరీ సీటింగ్ పిక్స్ వరకు ప్రతీ ఫ్రేమ్‌లోనూ మాళవిక తనదైన రాయల్ ఎక్స్‌ప్రెషన్లతో ఆకట్టుకున్నారు. 'ది రాజా సాబ్'తో టాలీవుడ్ ఎంట్రీ: మాళవిక మోహనన్ సినీ ప్రయాణం విషయానికి వస్తే, గతంలో ఆమె రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం జనవరి 9, 2026న విడుదలై ప్రేక్షకులను బాగా అలరించింది. ఇక ఈ సినిమాతో మాళవిక తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. కొలీవుడ్‌లో వరుస హిట్లు, కొత్త ప్రాజెక్టులు: టాలీవుడ్‌లోనే కాకుండా తమిళంలోనూ మాళవిక వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల కార్తీ హీరోగా పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ స్పై థ్రిల్లర్ 'సర్దార్ 2' లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో విజయ్ సేతుపతితో కలిసి ఒక పవర్‌ఫుల్ క్రైమ్ డ్రామా ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఇక మొత్తానికి చూస్తే, వెండితెరపై పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో అలరిస్తూనే, సోషల్ మీడియాలో తనదైన క్లాసిక్ అండ్ ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్‌తో మాళవిక మోహనన్ మెస్మరైజ్ చేస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ 'వైట్ గ్లామర్' ఫొటోలు ప్రస్తుతం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ నెట్టింట తెగ హల్ చల్ చేస్తున్నాయి.



నగినా నాగినిలా మారిపోయిన జాన్వీ కపూర్!

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ అద్భుతమైన రూపంతో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించారు. సాధారణంగా హలోవీన్ అనగానే విదేశీ తరహా దెయ్యాల వేషాలు, భయానక రూపాలు గుర్తుకు వస్తాయి. కానీ జాన్వీ కపూర్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఆలోచించి తల్లి, దివంగత నటి శ్రీదేవి అరుదైన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1986లో బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన క్లాసిక్ ఫాంటసీ డ్రామా -నగినా- చిత్రంలోని శ్రీదేవి ఐకానిక్ లుక్‌ను అచ్చం అలాగే రీక్రియేట్ చేసి జాన్వీ అందరినీ ఆశ్చర్యపరిచారు. -నగినా- చిత్రంలో శ్రీదేవి అద్భుతమైన అభినయం, క్లైమాక్స్ పాము నాట్యం చలనచిత్ర చరిత్రలోనే నిలిచి పోయాయి. ఆ సినిమాలోని నాగిని గెటప్‌ను తలపించేలా జాన్వీ కపూర్ సరిగ్గా అదే రకమైన కాస్ట్యూమ్స్, మేకప్, హెయిర్‌స్టైల్‌తో కెమెరా ముందుకొచ్చారు. చిన్నపాటి డీటెయిల్స్ సైతం మిస్ కాకుండా అమ్మడు పడిన శ్రమ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. అచ్చం శ్రీదేవి లాగే జాన్వీ పోజులివ్వడం చూసిన నెటిజన్లు, అభిమానులు ఒక్కసారిగా గతకాలపు జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. తల్లి పోలికలతో అచ్చం శ్రీదేవిలాగే కనిపిస్తున్న జాన్వీని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఈ లుక్‌కు సంబంధించి జాన్వీ కపూర్ సోషల్ మీడియా వేదికగా కొన్ని ఫోటోలను పంచుకున్నారు. -హ్యాపీ హలోవీన్- సినిమా చరిత్రలోనే అత్యంత అద్భుతమైన ఐకానిక్ క్షణాలలో ఒకదానిని నేను రీక్రియేట్ చేయాల్సిందే అనుకున్నాను- అని క్యాప్షన్ రాసుకొచ్చారు. అలాగే తల్లి శ్రీదేవితో పాటు ఆ చిత్రంలోని ఇతర ప్రముఖ పాత్రలను ఉద్దేశించి.. -అమ్మ, రిషి అంకుల్, అమ్రిష్ సర్ కంటే ఐకానిక్ ఎవరూ ఉండగలరు- అంటూ వారిపై అభిమానం చాటుకున్నారు. ఈ ఫొటోషూట్‌లో జాన్వీతో పాటు ఆమె స్నేహితులు కూడా భాగస్వామ్యం కావడం విశేషం. సోషల్ మీడియా సెలబ్రిటీ ఒరి చిత్రంలో రిషి కపూర్ పాత్రను పోలి ఉండే గెటప్‌లో కనిపించగా.. మరో వ్యక్తి అమ్రిష్ పూరి పాత్రను తలపించేలా పోజులిచ్చారు. -నగినా- చిత్రంలోని ప్రధాన పాత్రలైన నాగిని.. ఆమె భర్త, విలన్ పాత్రలను ఇలా సరదాగా రీక్రియేట్ చేసిన తీరు నెట్టింట నవ్వులు పూయిస్తుంది. సినిమాల పరంగా చూస్తే జాన్వీ కపూర్ వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నారు. ఇటీవలి కాలంలో విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ నటిగా పరిధిని విస్తరించుకుంటున్నారు. సోషల్ మీడియాలో మాత్రం కుటుంబ జ్ఞాపకాలను, అమ్మ శ్రీదేవిని తరచుగా గుర్తుచేసుకుంటూ ఉంటారు. హలోవీన్ వేడుకలను సరదా పార్టీలా కాకుండా తల్లికి అంకితం చేసిన అద్భుతమైన ట్రిబ్యూట్‌గా మార్చడం ద్వారా జాన్వీ మరోసారి తల్లిపై ప్రేమను చాటుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ వర్గాలతో పాటు కోట్లాది మంది అభిమానులు జాన్వీ కపూర్ ఆలోచనను, ఆమె చేసిన ఈ అద్భుతమైన రీక్రియేషన్‌ను తెగ ప్రశంసిస్తున్నారు. అమ్మ జ్ఞాపకాలను ఇలా సరికొత్త తరహాలో వెండితెర నాటి రోజులను గుర్తుచేసేలా చేయడం నిజంగా ప్రశంసనీయమని అభిప్రాయపడుతున్నారు.





విశ్వంభర... కాకా.. మళ్ళీ ఏంటీ తికమక?


చిరంజీవి సినిమాల రిలీజ్ విషయంలో మళ్లీ పాత సందేహమే మొదలైంది. ఒక సినిమా కోసం సంక్రాంతి తేదీ ప్రకటించారు. అది మారదని నిర్మాతలు మరోసారి చెప్పాల్సి వచ్చింది. అయినా ఇప్పుడు ఇంకో సినిమా అదే పండగకు వస్తుందంటున్నారు. పైగా చిరంజీవి కూడా అంగీకరించారనే టాక్ వినిపిస్తోంది. ఇలాంటి ప్రచారం గతంలో వచ్చినప్పుడు వెంటనే వివరణ ఇచ్చారు. ఈసారి మాత్రం ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదు. 'విశ్వంభర'ను 2027 సంక్రాంతికి తీసుకురావడానికి చిరంజీవి ఓకే చెప్పారనే టాక్ వినిపిస్తోంది. అమెజాన్ ప్రైమ్ ఓటీటీ హక్కులు తీసుకుందని, సంక్రాంతికే విడుదల చేయాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది. నవంబర్‌లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే యూవీ క్రియేషన్స్ నుంచి ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి ప్రకటన రాలేదు. ఇదే సమయంలో బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కాకా'కు జనవరి 13వ తేదీ ఖరారైంది. సెప్టెంబర్‌లో 'విశ్వంభర' సంక్రాంతికి వస్తుందనే వార్తలు వచ్చినప్పుడు 'కాకా' నిర్మాతలు విడుదల వాయిదా పడదని స్పష్టం చేశారు. బాబీ కూడా తేదీ మారదన్నారు. చిరంజీవి సైతం ఆ సినిమా సంక్రాంతికి వస్తుందని చెప్పారు. సెప్టెంబర్ చివర్లో 'కాకా' మొదటి భాగం షూటింగ్ పూర్తయిందని, రెండో భాగంలోనూ కొంత పని జరిగిందని చిరంజీవి వెల్లడించారు. 'విశ్వంభర' మొదట 2025 సంక్రాంతికి రావాల్సింది. ఆ తర్వాత గ్రాఫిక్స్ పనుల కారణంగా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై యూవీ క్రియేషన్స్ చాలా కాలంగా పనిచేస్తోంది. గతంలో ఓ పాట కూడా విడుదల చేశారు. కానీ సినిమా తేదీ ఫిక్స్ కాకపోవడంతో తర్వాత ప్రచారం కొనసాగలేదు. ఇప్పుడు గ్రాఫిక్స్ పనులు పూర్తయ్యాయని వార్తలు వస్తున్నా, విడుదల తేదీ మాత్రం ప్రకటించలేదు. థియేట్రికల్ బిజినెస్ కూడా ఇంకా ఖరారు కావాల్సి ఉందని టాక్ వినిపిస్తోంది. అక్టోబర్‌లో మాత్రం 'విశ్వంభర'ను మార్చిలో విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు మరో టాక్ వచ్చింది. రాజమౌళి 'వారణాసి' ఏప్రిల్‌లో రానుండటంతో దానికి ముందే విడుదల చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. నెల తిరగకముందే సంక్రాంతి పేరు మళ్లీ వినిపిస్తోంది. ఒకే హీరో నటించిన రెండు పెద్ద సినిమాలు రోజుల వ్యవధిలో వస్తే థియేటర్ల కేటాయింపు, ప్రచారం విషయంలో ఇబ్బందులు ఉండొచ్చు. అందువల్ల ఒక సినిమా తేదీ మారకుండా ఈ ప్లాన్ అమలు కావడం కష్టమే. మరోవైపు 'కాకా' టీమ్ సంక్రాంతి విడుదలకు తగ్గట్లుగా షూటింగ్ కొనసాగిస్తోంది. ఆ సినిమా నుంచి తొలి పాటను త్వరలో విడుదల చేస్తామని కూడా నిర్మాతలు ప్రకటించారు. 'విశ్వంభర'లో త్రిష నటిస్తుండగా కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నవంబర్‌లో విడుదల తేదీ ప్రకటిస్తారన్న టాక్ కు క్లారిటీ రావాలంటే యూవీ క్రియేషన్స్ రంగంలోకి దిగాల్సిందే.

కీర్తి 'అక్క'.. టాక్ ఎలా ఉంది?

ఇద్దరు మంచి నటీమణులు, 80వ దశకం నేపథ్యం, ఇప్పటివరకు ఎక్కువగా చూడని ఓ కథ. ట్రైలర్ వచ్చినప్పుడే 'అక్క' వెబ్ సిరీస్‌పై ఆసక్తి పెరిగింది. పైగా కీర్తి సురేష్ పూర్తిగా కొత్త గెటప్‌లో కనిపించారు. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యాక మాత్రం ప్రేక్షకుల నుంచి ఒకే రకమైన రెస్పాన్స్ రావడం లేదు. ముఖ్యంగా సోషల్ మీడియాలో సిరీస్‌లోని కొన్ని అంశాలకు ప్రశంసలు వస్తుండగా, కథనం విషయంలో డిఫరెంట్ రియాక్షన్స్ కనిపిస్తున్నాయి. కీర్తి సురేష్, రాధికా ఆప్టే నటించిన ఈ సిరీస్ అక్టోబర్ 30న విడుదలైంది. 1980ల కాలంలో పెర్నూరు అనే ఊరిని మహిళలే పాలిస్తుంటారు. అక్కడ భవానిగా కీర్తి కనిపించగా, ఆమె అధికారాన్ని సవాల్ చేసే రుద్ర పాత్రలో రాధికా నటించారు. ఇద్దరి మధ్య అధికారం కోసం జరిగే పోరాటంతో కథ సాగుతుంది. మహిళల చేతుల్లో పాలన అనే కాన్సెప్ట్ కొత్తగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కీర్తి నటనకు సోషల్ మీడియాలో మంచి ప్రశంసలు కనిపిస్తున్నాయి. భవాని పాత్రలో ఆమె హావభావాలు, గంభీరంగా కనిపించిన తీరు బాగున్నాయని కొందరు పోస్టులు పెడుతున్నారు. రాధికా ఆప్టే నటనకు కూడా సానుకూల స్పందన ఉంది. అయితే మరికొందరు మాత్రం ఇద్దరి పాత్రలను ఇంకా బలంగా రాసి ఉండాల్సిందని అంటున్నారు. ముఖ్యంగా రాధికా పాత్రలో కోపానికి తగ్గ కారణాలను కథలో సరిగ్గా చూపించలేదనే కామెంట్స్ వస్తున్నాయి. కథ విషయంలోనే ఎక్కువ భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. మొదట ఆసక్తికరంగా మొదలైనా, తర్వాత ఏం జరుగుతుందో ముందే ఊహించగలిగేలా ఉందంటున్నారు. పాత్రలు ఎక్కువగా ఉండటంతో ఎవరికి ఎవరితో సంబంధముందో అర్థం చేసుకోవడం కష్టమైందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అధికారం, ప్రతీకారం చుట్టూ కథ తిరుగుతున్నా పాత్రల బాధను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చూపించలేకపోయారనే అభిప్రాయమూ వినిపిస్తోంది. మరోవైపు సిరీస్ మేకింగ్‌ను మెచ్చుకుంటున్నవాళ్లూ ఉన్నారు. భారీ సెట్లు, కాస్ట్యూమ్స్, అప్పటి వాతావరణాన్ని చూపించిన విధానం బాగున్నాయంటున్నారు. కొన్ని యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకున్నాయని ప్రశంసలు వస్తున్నాయి. అయితే ఆ భారీ హంగులకు తగ్గ స్థాయిలో కథ లేదనే విమర్శలూ ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో హింస ఎక్కువగా ఉందని, యాక్షన్ మరింత బాగా ఉండాల్సిందని అంటున్నారు. మోనికా పన్వార్ నటనకు కూడా మంచి కామెంట్స్ కనిపిస్తున్నాయి. యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ సిరీస్‌కు ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహించారు. మొత్తం ఐదు ఎపిసోడ్లు ఉండగా, నిడివి దాదాపు మూడు గంటలు. తెలుగు డబ్బింగ్‌లోనూ అందుబాటులో ఉంది. చివరి ఎపిసోడ్‌లోని కొన్ని మలుపులు కూడా ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేదనే అభిప్రాయాలున్నాయి. మొత్తంగా సోషల్ మీడియాలో కీర్తి నటనకు మంచి ప్రశంసలు అయితే వస్తున్నాయి. కానీ ఆ సిరీస్ కథకు మాత్రం పాజిటివ్ రెస్పాన్స్ కనిపించడం లేదు.



ఎన్టీఆర్ డ్రాగన్.. నీల్ పాత ఫార్ములా మారుతోందా?



ప్రశాంత్ నీల్ సినిమా అంటే ప్రేక్షకులకు కొన్ని అంచనాలు ఉంటాయి. హీరోను భారీగా చూపించడం, పవర్‌ఫుల్ యాక్షన్ సీన్స్, థియేటర్ దద్దరిల్లే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్.. ఇవన్నీ ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. కేజీఎఫ్‌తో మొదలైన ఈ స్టైల్ సలార్‌లోనూ కొనసాగింది. ఇప్పుడు ఎన్టీఆర్‌తో చేస్తున్న డ్రాగన్ విషయంలో మాత్రం నీల్ ఏమైనా మార్పులు చేస్తున్నారా అనే సందేహం కలుగుతోంది. అందుకు కారణం ఈ సినిమా సంగీతం విషయంలో వినిపిస్తున్న ఓ కొత్త టాక్ వైరల్ అవుతోంది. ూశ్రీంశీ =ఱఎ - దర్టీభామ మరో రెండు సౌత్ సినిమాల్లో! డ్రాగన్‌కు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. కేజీఎఫ్, సలార్ సినిమాల్లో నీల్ చూపించిన హీరోయిజానికి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎంతగా ఉపయోగపడిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటి కాంబినేషన్‌లోకి ఇప్పుడు మరో సంగీత దర్శకుడు శశ్వత్ సచ్‌దేవ్ పేరు వినిపిస్తోంది. ధురంధర్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న శశ్వత్ కూడా డ్రాగన్ కోసం పనిచేయబోతున్నారనే ప్రచారం మొదలైంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. నిజానికి నీల్ సినిమాల్లో సంగీతం కేవలం సన్నివేశానికి తోడుగా ఉండదు. హీరో ఎంట్రీ నుంచి యాక్షన్ ఎపిసోడ్స్ వరకు చాలా చోట్ల బ్యాక్‌గ్రౌండ్ స్కోరే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. కేజీఎఫ్‌లో యష్‌ను, సలార్‌లో ప్రభాస్‌ను చూపించిన విధానంలో కొన్ని పోలికలు కనిపిస్తాయి. ముఖ్యంగా హీరో ఎలివేషన్లు, భారీ యాక్షన్ సీన్స్ విషయంలో నీల్ తనకు బాగా కలిసొచ్చిన పద్ధతినే అనుసరించారు. అయితే డ్రాగన్‌లోనూ అదే తరహా సన్నివేశాలు, సంగీతం ఉంటే ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వడం కష్టమవుతుంది. మరోవైపు ఎన్టీఆర్ నటనను ఉపయోగించుకోవడానికి నీల్ దగ్గర మంచి అవకాశం ఉంది. యష్, ప్రభాస్‌లతో పోలిస్తే ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, డ్యాన్స్, ఎమోషనల్ సీన్స్‌లో తనకంటూ ప్రత్యేకమైన బలాలు ఉన్నాయి. అలాంటి హీరోను కేవలం స్లో మోషన్ షాట్లు, భారీ ఫైట్లకే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా ఎన్టీఆర్ పాత్రలోని భావోద్వేగాలను కూడా బలంగా చూపిస్తే నీల్ గత సినిమాలకు భిన్నంగా డ్రాగన్‌ను తీర్చిదిద్దవచ్చు. సంగీతం విషయంలోనూ అలాంటి మార్పు ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే శశ్వత్ పేరు వినిపిస్తున్నంత మాత్రాన నీల్ తన పాత స్టైల్‌ను పూర్తిగా మార్చేస్తున్నారని అనుకోలేం. ఒకవేళ ఆయన ఈ ప్రాజెక్ట్‌లో భాగమైతే రవి బస్రూర్‌తో కలిసి పనిచేస్తారా, లేక పాటలు లేదా కొన్ని ప్రత్యేక సన్నివేశాలకు మాత్రమే సంగీతం అందిస్తారా అనేది చూడాలి. ఇద్దరు కంపోజర్లు ఉన్నా సినిమాలో సంగీతం ఒకే తరహాలో సాగడం ముఖ్యం. లేదంటే ఒక్కో సన్నివేశం ఒక్కోలా అనిపించే ప్రమాదం ఉంటుంది. అందుకే ఇద్దరి పనిని ఎలా ఉపయోగించుకుంటారనేది కీలకం. డ్రాగన్ షూటింగ్ ప్రస్తుతం స్పీడ్ గానే కొనసాగుతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రి మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇప్పటికే రవి బస్రూర్ పేరు ప్రకటించిన నేపథ్యంలో శశ్వత్ విషయంలోనూ చిత్రబృందం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఒకవేళ ఇద్దరూ పనిచేస్తే నీల్ తన సినిమాల్లో ఇప్పటివరకు పాటించిన సంగీత పద్ధతిలో ఎలాంటి మార్పులు చేస్తారనేది మరింత ఆసక్తికరంగా ఉంటుంది.

Printed by M/s Sri Venkataramana Offset Printers Published by Syed Tajbaba on behalf of Syed Tajbaba,
Printed at Peddapalli and published at B-12 Ntpc Ramagundam,Editor SYED TAJBABA.